RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 63 శనివారం 29 మార్చి 2025 పేజీలు : 4

## బెంగళూరు ప్యాలెస్‌పై ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఓకే..

బెంగళూరు: బెంగళూరు ప్యాలెస్ మైదానం భూమి వినియోగానికి సంబంధించి ఆర్డినెన్స్ ద్వారా అవసరమైన స్థలాన్ని వాడుకోవడంతోపాటు నిర్దిష్ట రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం లభించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్డినెన్స్‌కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అంగీకారం తెలిపారు. 427 ఎకరాలు 16 గుంటల విస్తీర్ణంలోని బెంగళూరు ప్యాలెస్ స్థల వినియోగం, నియంత్రణ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లభించింది. గత రాష్ట్రమంత్రివర్గ భేటీలో టీడీఆర్ ఇవ్వరాదని ప్రభుత్వం తీర్మానించింది. ఇందుకు సంబంధించి గవర్నర్ ఆమోదం తెలిపారు. సుమారు 3వేల కోట్ల రూపాయల విలువైన బెంగళూరు ప్యాలెస్ భూమికి సంబంధించి టీడీఆర్ విషయంలో మైసూరు రాజమాత, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వివాదం సాగుతోంది.

# ఆఖరి ప్రయత్నాల్లో ఆశావహులు!

## మంత్రి పదవుల వేటలో.. హస్తిన బాట..!!



హైదరాబాద్ : తెలంగాణ కేబినెట్ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంత్రి పదవుల కోసం ఆశావహులైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీ బాట పట్టారు. మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలన్న దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిందని చెబుతున్నా.. ప్రయత్నిస్తే పోయేదేముంది? అనుకుంటూ ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలను కలిసి మంత్రి మండలిలో ప్రాతినిధ్యం కోసం ఎవరి తిప్పలు వారు పడుతున్నారు. తెలంగాణ కేబినెట్‌లో ప్రస్తుతం ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. విస్తరణలో భాగంగా ఎంతమందికి అవకాశమిస్తారన్నదానిపై స్పష్టత లేకపోయినా పదవుల కోసం ఆశావహులు పదుల సంఖ్యలోనే ఉన్నారు. వారు మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు ఒక్కొక్కరుగా ఢిల్లీ చేరుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిందే తడవుగా ఢిల్లీ విమానం ఎక్కేశారు. ఒకరు తర్వాత ఒకరు వరుసగా ఢిల్లీకి క్యూ కట్టారు. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలు దేశ రాజధానికి మారినట్లయ్యింది. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగా రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బాలునాయక్ ఢిల్లీకి చేరుకుని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లను కలిశారు. ఇక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం ఢిల్లీకి బయలు దేరారు. అహ్మదాబాద్ లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీ(డ్రాఫ్టింగ్ కమిటీ) సమావేశానికి భట్టి హాజరుకానున్నారు. మరోవైపు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం ఢిల్లీలోనే ఉన్నారు. మంత్రివర్గంలో స్థానం కోరుతున్న కాంగ్రెస్ మాదిగ, లంబాడీ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు సైతం తమ ప్రయత్నాలు చేసేందుకు ఢిల్లీకి పయనమయ్యారు. మరి హస్తిన చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఎవరి ప్రయత్నాలు ఫలించి అమాత్యులయ్యే అదృష్టవంతులెవరన్నది ఏప్రిల్ 3వ తేదీలోగా తేలిపోనుంది.

# 1500 ఎకరాల్లో...

## బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ..



బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఈసారి హన్మకొండ జిల్లాలో నిర్వహించాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభను హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించబోతున్నారు. శుక్రవారం సభ మైదానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. సభ నిర్వహణకు అనుమతినివ్వాలని కాజీపేట ఏసీపీకి దరఖాస్తు చేశారు. సభ నిర్వాహణకు సంబంధించి భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ ఇతర అనుమతులు మంజూరులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏసీపీని కలిసిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, సతీష్ బాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి తదితరులు ఉన్నారు. వరుస ఓటముల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లోని నైరాశ్యాన్ని తొలగించేందుకు భారీ స్థాయిలో రజోత్సవ వేడుకలు నిర్వహించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నిర్ణయించారు. ఏప్రిల్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో ప్లీనరీ నిర్వహించాలని, 27న వరంగల్‌లో సుమారు ఐదు లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు అనుసంధానంగా, అనువుగా ఉండే ఎల్కతుర్తిని ఎంపిక చేశారు. 1500 ఎకరాల్లో సభ నిర్వహించబోతున్నట్లు సమాచారం.

# సీఎం రేవంత్ రెడ్డి ఎందుకా మాట అన్నారు? వ్యూహంలో భాగమా?




హైదరాబాద్ : ఏంటా ధైర్యం? ఎందుకలా మాట్లాడారు? తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టుండి అంత మాట అనేశారేంటి? ఆయన మనసులో ఏముంది? వాళ్ళకు ధైర్యం చెప్పే మాటలా? లేక అంతకు మించిన వ్యూహమా?.. అసలింతకీ ఏమన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి? ఆయన మాటల చుట్టూ ఓ రేంజ్‌లో చర్చ ఎందుకు జరుగుతోంది? ఇవే.... అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి నోటి నుంచి వచ్చిన ఈ మాటలే ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చనీయాంశం అయ్యాయి. ఇటు సొంత పార్టీ, అటు ప్రతిపక్షాలు ఈ మాటల మీదే స్పెషల్ ఫోకస్ పెట్టి చర్చోప చర్చలు చేసేస్తున్నాయి. అసలు ఏ ధైర్యంతో ఆయన ఆ మాటలు అన్నారు? పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోవని అంత కాన్ఫిడెంట్‌గా సభ సాక్షిగా ఎలా చెప్పగలిగారు? అసలు ఆయన వెనక వ్యూహం ఏంటి..అని మాట్లాడుకుంటున్నారు అన్ని పార్టీల నాయకులు. ఉప ఎన్నికలు రావు... ఎందుకు వస్తాయని ఒక వ్యూహం ప్రకారమే ఆయన సభలో ప్రశ్నించారా అన్న వ్యాఖ్యలు సైతం వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడెందుకు వస్తాయంటూ కౌంటర్ ఇచ్చారు సీఎం. ఎవ్వరూ ఆందోళన పడాల్సిన పనిలేదు. ఉప ఎన్నికలు రావని భరోసా ఇచ్చారాయన. దాంతో రేవంత్ రెడ్డి మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్ నుంచి హరీష్ రావు స్పందించారు. కోర్టులో ఉన్న వ్యవహారంపై సీఎం కామెంట్ చేయడం సరికాదని, సభలో ఆయన అన్న మాటల్ని సుప్రీంకోర్టులో చూపిస్తామని చెప్పారు హరీష్. అయితే అందుకు కూడా క్లారిటీ ఇచ్చేశారు ముఖ్యమంత్రి. తాను కోర్టును ఉద్దేశించి మాట్లాడలేదని,ఉప ఎన్నికలు వస్తాయంటూ ఓ పార్టీ నాయకుడు చేస్తున్న ప్రచారం గురించి మాత్రమే మాట్లాడానని క్లారిటీ ఇచ్చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా... అసలు సీఎం అంత కాన్ఫిడెంట్‌గా ఉప ఎన్నికలు రావని ఎలా చెప్పగలిగారంటూ ఆరాలు తీయడం మొదలైపోయింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కొందరు కాస్త అసంతృప్తితో ఉన్నారని, తిరిగి సొంత గూటికి వెళ్తారని ఓ ప్రచారం జరుగుతోంది. దీన్నే అనుకూలంగా మల్చుకుంటున్న ప్రతిపక్షం... ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయని, గుణపాఠం చెప్పడం ఖాయమంటూ వాయిస్ పెంచుతోంది. దాని కౌంటర్‌గానే... బైపోల్స్ జరగబోవని సీఎం అన్నట్టుగా విశ్లేషిస్తున్నారు కొందరు. పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఆందోళన కలిగించేలా విపక్షం వ్యూహం పన్నిందని, కానీ.... అంత సీన్ లేదంటూ... తమ పక్షాన చేరిన వారికి భరోసా ఇచ్చే ప్రయత్నంలో భాగంగానే ఆ కామెంట్స్ చేసి ఉండవచ్చని చెప్పుకుంటున్నారు.

దీనికి తోడు... గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను విలీనం చేసుకోవడం, పార్టీ ఫిరాయింపులపై అప్పట్లో ఫిర్యాదు చేసిన లెక్కచేయకుండా వ్యవహరించిన బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టడం కోసం కూడా అలా మాట్లాడి ఉండవచ్చంటున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అదసలు సమస్యే కాదన్నట్టు వ్యవహరించిన గులాబీ నేతలు ఇప్పుడు మాత్రం అంతకు మించిన సమస్య వేరొకటి లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వైఖరిపై చర్చ పెట్టేందుకే సీఎం అలా మాట్లాడి ఉండవచ్చన్నది ఇంకో వెర్షన్. బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరిని మరోసారి జనం ముందు పెట్టడం, ఒక్కో పార్టీకి.... ఒక్కో న్యాయమా అనే అంశం మీద మాట్లాడుకునేలా చేసే వ్యూహం కూడా ఉందని అంటున్నారు. మొత్తం మీద అటు పార్టీ మారిన ఎమ్మెల్యేలకు భరోసా ఇవ్వడం, ఇటు ప్రతిపక్షం వైఖరిని ఎండగట్టడం లాంటి బహుళ ప్రయోజన టార్గెట్‌తోనే రేవంత్‌రెడ్డి అలా మాట్లాడి ఉండవచ్చంటూ విశ్లేషిస్తున్నారు పొలిటికల్ పండిట్స్.




# నానాటికి పెరుగుతున్న... రేవంతుడి గ్రాఫ్...!

## పార్టీ - ప్రభుత్వంపై తనదైన శైలిలో పట్టు!

## అసెంబ్లీలో అదరగొట్టిన సీఎం రేవంత్ రెడ్డి!!

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మేం కక్షపూరిత రాజకీయాలు చేయాలనుకుంటే కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారని అన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారని చెప్పారు. డ్రోన్ ఎగరవేశానని ఎంపీని అయిన నా మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని ఆరోపించారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిలుపై వచ్చి వెళ్లానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారని పేర్కొన్నారు.

కేటీఆర్, కేసీఆర్‌కు జైలులో డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టించి ఇస్తానని అన్నానని చెప్పారు. కానీ అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్ష రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. కేటీఆర్, కేసీఆర్‌ను జైలులో వేయాలని చాలామంది మమ్మల్ని అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదని ఆరోపించారు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్ల రుణమాఫీ చేశారని చెప్పారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8500 కోట్లు పైగా అయ్యిందని వివరించారు. మేం అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే రూ.26 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని రైతుబంధు కూడా వేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ఎగవేసిన రైతుబంధు రూ.7625 కోట్లు మేం చెల్లించామని చెప్పారు. వరి వేస్తే ఉరే అని స్వయంగా సీఎం బెదిరించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## మూడోసారి యోగీ సీఎం అవుతారా ?

ఉత్తరప్రదేశ్ లో 2017లో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టింది. అది కూడా 400కి పైగా అసెంబ్లీ సీట్లు ఉన్న అసెంబ్లీలో మూడొంతుల మెజారిటీ సాధించింది. దాంతో బీజేపీకి తిరుగులేదు అని అంతా అనుకున్నారు. ఇక యూపీ సీఎం అభ్యర్థులుగా ఆనాడు ఎంతోమంది అతిరథ మహారధులు ఉన్నారు. కానీ బీజేపీ అధినాయకత్వం అనూహ్యంగా అప్పటికి ఎంపీగా ఉన్న యోగీ ఆదిత్యనాథ్ ని ఎంపిక చేసింది. అలా ఆయన దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన యూపీకి సీఎం అయ్యారు. ఆయన చూస్తే యోగి యూపీని ఎలా పాలిస్తారు అన్న డౌట్లు అందరిలో ఉన్నాయి. కానీ బుల్డోజర్ సీఎం గా యోగీ తొందరలోనే తన మార్క్ చాటుకున్నారు. అక్రమార్కుల మీద బుల్డోజర్ అంటూ ఆయన కొత్త స్టైల్ పాలిటిక్స్ కి తెర లేపారు. తొలి అయిదేళ్ళలోనే సీఎం గా ఆయన పాతుకుని పోయారు. ఇక 2022లో జరిగిన ఎన్నికల్లో సీట్లు తగ్గినా యోగీ తన ఇమేజ్ తో యూపీలో బీజేపీని గెలిపించారు అన్న ప్రచారం అయితే సాగింది. ఈ రోజున దేశంలో చూస్తే సొంత ఇమేజ్ కలిగిన బీజేపీ ముఖ్యమంత్రులు పెద్దగా కనిపించరు. అది ఒక్క యోగీ విషయంలో మాత్రమే వేరుగా ఉంది. ఆయన సొంతంగా పలుకుబడి కలిగిన వారుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన కనుక జనంలోకి వెళ్తే పెద్ద ఎత్తున జనాలు వస్తారు. ఆయన పేరు యూపీలో మారుమోగుతూ ఉంటుంది. పాలన మీద ఆయన ముద్ర బాగా ఉంది. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం కానీ ఇటీవల ప్రయాగ్ రాజ్ లో జరిగిన ప్రపంచ స్థాయి అతి పెద్ద ఆధ్యాత్మిక జాతర మహా కుంభమేళా కానీ యోగీ ఖాతాలోనే క్రెడిట్లుగా పడ్డాయి. లా అండ్ ఆర్డర్ కూడా ఆయన కంట్రోల్ లో పెట్టారు. పాలన మొత్తం తన కనుసన్నలలోకి తెచ్చుకున్నారు. ఒక విధంగా చూస్తే అటు ఆరెస్సెస్ మద్దతు తో పాటు బలమైన హిందూత్వ వాణితో యోగీ జాతీయ స్థాయిలో బీజేపీకి తిరుగులేని నాయకుడిగా ఉన్నారు. మోడీ తప్పుకుంటే యోగీయే ఆల్టర్నేషన్ అని అంతా అనుకునే నేపథ్యం ఉంది. ఈ క్రమంలో ఆ మధ్య ఇండియా టూడే కాంక్లేవ్ లో యోగీ భవిష్యత్తు రాజకీయాల గురించి ప్రశ్న ఎదురైనప్పుడు మళ్ళీ మఠానికే అని జవాబు చెప్పి సంచలనం రేపారు యూపీ సీఎం. యూపీకి 2027లో ఎన్నికలు జరగబోతున్నాయి. బీజేపీ అక్కడ బలంగా ఉంది. మళ్ళీ గెలవాలని అంటే యోగీ ఫేస్ తోనే వెళ్లాలి. యోగీనే సీఎం అభ్యర్థిగా ప్రాజెక్ట్ చేయాలి. కానీ యోగీ మాత్రం తన మఠం తన ఆధ్యాత్మికం అని అంటున్నారు. ఇదే రాజకీయ చర్చ అనుకుంటే తాజాగా ఆయన సీఎం గా ఎనిమిదేళ్ళు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఈ తరహా అభిప్రాయాలనే వెలిబుచ్చారు. యూపీలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుంది అని ఆయన ధీమాగా చెప్పారు. యూపీని మళ్ళీ పాలించేది బీజేపీ సీఎం నే అని మాత్రమే యోగీ అన్నారు. అంతే తప్ప తానే హ్యాట్రిక్ సీఎం అని అనలేదు. దాంతోనే ఇది హాట్ డిస్కషన్ గా మారుతోంది. ఫిఫ్టీ ప్లస్ ఏజ్ లో ఉన్న యోగీ పొలిటికల్ గా యంగ్ లీడర్ అని చెప్పాలి. అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం గా ఆయన పేరు ఉంది బీజేపీ మళ్ళీ గెలిస్తే ఆయనకే కదా చాన్స్ అని అంతా అనుకుంటున్న వేళ యోగీ ఈ విధంగా అంటున్నారు అంటే ఆయనలు రాజకీయాల మీద ఆసక్తి తగ్గిందా లేక ఆయనను కాకుండా బీజేపీ పెద్దలు వేరే వారిని సీఎం గా పెట్టాలని అనుకుంటున్నారా లేక యోగి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తారా అన్న సందేహాలు అందరిలో కలుగుతున్నాయి. ఏది ఏమైనా ఎవరు అవునన్నా కాదన్నా బీజేపీలో మోదీ తరువాత యోగీకే ఎక్కువ మంది సపోర్టు ఉంది. ఆయనే బీజేపీని జాతీయ స్థాయిలో లీడ్ చేయగలరని అంతా బలంగా నమ్ముతున్నారు. యోగీ తాను మఠానికే అని అన్నా ఆయనను మాత్రం కాషాయం నేతలు కానీ ఆరెస్సెస్ కానీ వదిలే సమస్య లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. యోగి యూపీకి మూడోసారి సీఎం అవుతారా లేదా అన్నది భవిష్యత్తు చెబుతుంది.

# దెబ్బతిన్నదారులు.. కొత్త నిర్మాణాలే మేలు



సిరిసిల్ల : జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. వర్షాలకు రోడ్డు కోతకు గురికాగా ఏటా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. వీటికి శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో మూడేళ్లుగా పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటీవల రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి రాష్ట్రస్థాయి సమీక్ష నిర్వహించారు. దెబ్బతిన్న రహదారులపై జిల్లాలవారీగా నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో హామ్ (హైబ్రిడ్జ్ అన్యూటి మోడల్)లో 300 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపారు.

**మరమ్మతులు చేపట్టాల్సినవి...**

జిల్లాలో వేములవాడ నియోజకవర్గంలో 130 కిలోమీటర్లు, సిరిసిల్లలో 120 కిలోమీటర్లు, బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో 50 కిలోమీటర్ల రహదారులు గుర్తించారు. దెబ్బతిన్న వాటికి వర్షాకాలం లోపు మరమ్మతులు పూర్తిచేసేలా ఆధునిక యంత్రాలను వాడాలని నిర్ణయించారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి ముస్తాబాద్ మండలం గూడెం. ఇల్లంతకుంట మండలం ముస్కాన్‌పేట నుంచి సిద్దిపేట. కోరుట్ల - వేములవాడ, కొండగట్టు - వేములవాడ రహదారులతోపాటు కరీంనగర్-కామారెడ్డి, శాత్రాజులపల్లి నుంచి పెద్దమ్మకూడలి వరకు ప్రధాన రోడ్లు ఉన్నాయి. కోనరావుపేట మండలం మామిడిపల్లి-నిజామాబాద్, నిమ్మపల్లి-వట్టిమల్ల, రహదారిలో మూలవాగుపై తాత్కాలిక వంతెనలు ఏటా కోతకు గురవుతున్నాయి. ఇప్పటికి మూడేళ్లుగా రూ. 15 లక్షలు వెచ్చించి మట్టి, పైపులతో చదును చేశారు. సిరిసిల్ల-మరిమడ్ల ప్రధాన రహదారిలో లచ్చపేట వద్ద లోలెవల్ వంతెన రోడ్డు కోతకు గురికావడంతో రూ.లక్షతో తాత్కాలిక మరమ్మతులు చేశారు.

వేములవాడ మండలం హన్మాజీపేట-బావుసాయిపేట, వేములవాడ-సిరికొండ మార్గంలో కాజ్‌వేల వద్ద ఏటా వరదలతో నీరు ముంచెత్తుతోంది. వేములవాడ-కోరుట్ల రహదారిలో చందుర్తి మండలం సనుగుల వద్ద రెండు చోట్ల రహదారి కోతకు గురైంది. వేములవాడ పట్టణ శివారులో బీరప్ప ఆలయం సమీపంలో మల్లారం రహదారిలో లోలెవల్ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది.

మాచారెడ్డి-ముస్తాబాద్-సిద్దిపేట రహదారిలో కాజ్‌వే ప్రమాదకరంగా మారింది. పెద్దమ్మ స్టేజి-లింగన్నపేట రహదారిలో హైలెవల్ వంతెన నిర్మాణ ప్రాంతంలో తాత్కాలిక రహదారి మానేరు వరద ఉధృతికి నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. ఇల్లంతంకుట మండలం జవారిపేట-నర్సక్కపేట మధ్యలో వరదతాకిడికి కాజ్‌వే పైపులతోసహా కొట్టుకుపోయింది. అధికారులు ఈ మార్గంలో రాకపోకలను దారిమళ్లించారు.

# ఇసుక లభించక ఇబ్బందులు



బోయినపల్లి : బోయినపల్లి మండలంలో మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లో మానేరు వాగు విస్తరించి ఉంది. మాన్వాడ గ్రామం నుంచి గతంలో ప్రభుత్వ పనులకు, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ పనులకు( సీసీ రోడ్లు, మురుగు కాలువ నిర్మాణం ఇతర పనులు) మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి అనుమతులు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కొంత మంది నిర్మాణ పనులు నిలిపివేశారు. ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభించాలన్న ఇసుక తప్పని సరి. వేసవి కాలం సమీపిస్తుండటంతో గ్రామాలు, పట్టణాల్లో నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. కాగా ఇసుక రవాణా చేసుకోవడానికి జిల్లాలో రెవెన్యూ అధికారులు ఆయా మండలాల పరిధిలో అనుమతులు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వ పనులు, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కావాల్సిన వారు సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రంతోపాటు ఒక్కో ట్రాక్టరు ట్రిప్పు ఇసుక కోసం రూ. 480 డీడీతీసి తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలి. అనంతరం అధికారులు సూచించిన రీచ్ నుంచి వారి పర్యవేక్షణలో నిబంధనల మేరకు నిర్ణీత సమయంలోగా ఇసుక రవాణా చేసుకోవాలి. ఒక్కో చోట వారంలో రెండు రోజులు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తుండగా మరికొన్ని చోట్ల ఒక రోజు మాత్రమే అనుమతిస్తున్నారు. ప్రస్తుతం నీటి లభ్యత ఉండటం, వాతావరణం అనుకూలతతో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఏప్రిల్, మే నెలాఖరుకు భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉండటంతో క్యూరింగ్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఇక వర్షాకాలం ప్రారంభమైందంటే నిర్మాణ పనులు ముందుకు సాగవని చెబుతున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి**

కోనరావుపేట మండలంలో కనగర్తిలోని మూలవాగు నుంచి స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనులకు ఇసుక రవాణాకు అనుమతి ఇస్తున్నారు. బావుసాయిపేట నుంచి కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులకు ఇసుక రవాణా జరుగుతుంది. ఇల్లంతకుంట మండలంలో బిక్కవాగు నుంచి ఇసుక తరలిస్తున్నారు.

వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లి, మల్లారం, వేములవాడ మండలం జయవరంలోని మూలవాగు నుంచి, రుద్రంగి మండలంలోని నందివాగు, ముస్తాబాద్ మండలంలో ఆవునూర్, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేస్తున్నారు

గంభీరావుపేట, చందుర్తి, వీర్నపల్లి మండలాల్లో ఇసుక రవాణాకు సమీప మండలాలపై ఆధారపడాల్సి వస్తుంది.


లారీల్లో తెప్పించడంతో అదనపు భారం

స్థానిక వాగుల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వక పోవడంతో లారీల్లో సుదూర ప్రాంతాల నుంచి ఇసుక తెప్పించా. దీనివల్ల అదనంగా రూ. 10 వేలు ఆర్థికభారం పడుతుంది. ప్రభుత్వ పనులకు వే బిల్లులు జారీ చేస్తున్నందున ఇంటి నిర్మాణదారులకు అనుమతులు ఇవ్వడానికి జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలినల్లగొండ అనిల్, బోయినపల్లి

నిబంధనల మేరకు తరలింపు

బోయినపల్లి మండలంలో చేపడుతున్న ప్రభుత్వ పనుల కోసం ఇసుక రవాణా చేసుకోవడానికి అనుమతులు జారీ చేస్తున్నాం. అధికారుల పర్యవేక్షణలో నిబంధనల మేరకు ఇసుక రవాణా జరుగుతుంది. నారాయణరెడ్డి, తహసీల్దారు, బోయినపల్లి

# తారు మెరిసింది.. ఊరు మురిసింది



పెద్దపల్లి: ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేరింది. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న రహదారి కష్టాలు ఎట్టకేలకు తీరాయి. చొరవ, ఎమ్మెల్యే సహకారంతో తారు రోడ్డు నిర్మాణం పూర్తయింది.లాలపల్లి గ్రామం మండల కేంద్రానికి 1.5 కిలోమీటర్లు, జిల్లాకేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదగా మారుతుండటంతో ఆర్టీసీ అధికారులు గ్రామం మీదుగా వెళ్లే బస్సులను రద్దు చేసి, మరో మార్గంలో నడిపించేవారు. భారీ వర్షాలు కురిస్తే ట్రాక్టర్లు మినహా మరో వాహనం నడిచే పరిస్థితి లేదు. గ్రామస్థుల ఇబ్బందులను గుర్తించిన గతేడాది ఆగస్టు నుంచి వరుస కథనాలతో రహదారి దుస్థితిని పాలకుల దృష్టికి తీసుకొచ్చింది. స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు నిధుల మంజూరుకు చొరవ చూపారు. ఎట్టకేలకు 1.4 కిలోమీటర్ల తారు నిర్మాణానికి సీఆర్ఆర్(గ్రామీణ రహదారుల నిర్మాణం) పథకం కింద రూ. 1.6 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు గత నవంబరులో భూమిపూజ నిర్వహించారు. చీమలపేట క్రాస్‌రోడ్డు నుంచి గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయం వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామంలో ప్రధానమైన బురద కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. ఇక ఆలయం నుంచి ఎలిగేడు వైపు వెళ్లే రోడ్డు వరకు మరో 600 మీటర్ల పనులు చేయాల్సి ఉంది. ఆ పనులను మరో ప్యాకేజీ కింద చేపట్టనున్నారు. ఎలిగేడు నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు 2.2 కిలోమీటర్ల దూరానికి రూ. 2.60 కోట్లు మంజూరు కాగా టెండర్లు పూర్తయ్యాయి.

**బస్సుల మళ్లింపుతో వెలుగులోకి..**కరీంనగర్ నుంచి జూలపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎలిగేడు, లాలపల్లి, చీమలపేట మీదుగా వెళ్తుంది. ఏటా వానాకాలం వచ్చిందంటే బురద రహదారిపై బస్సు టైర్లు జారుతుండటంతో గతేడాది ఆగస్టులో ఆర్టీసీ అధికారులు బస్సు మార్గాన్ని మళ్లించారు. ఎలిగేడు నుంచి ధూళికట్ట క్రాస్‌రోడ్డు నుంచి చీమలపేట మీదుగా నడిపించారు. దీంతో లాలపల్లి గ్రామస్థులు ఎలిగేడుకు కాలినడకన వెళ్లాల్సి వెళ్లాల్సి వచ్చింది. రాత్రిళ్లు అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు కూడా నడవకపోవడంతో ట్రాక్టర్లను ఆశ్రయించారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీ ప్రజల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామస్థుల కష్టాలపై వరుస కథనాలతో ఎమ్మెల్యే విజయరమణారావు సైతం ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించారు. తమ చిరకాల సమస్య పరిష్కారం కావడంతో లాలపల్లి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## తన వాహనంపై లిఫ్ట్ ఇస్తానంటూ నమ్మించి వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడును అపహరించిన గుర్తు తెలియని దొంగ

శామీర్ పేట, (గరుడ వార్త) : తన వాహనంపై లిఫ్ట్ ఇస్తానంటూ నమ్మబలికి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెలతాడును అపరిచిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీసర మండలం తిమ్మాయపల్లి కి చెందినసరపల్లి వరలక్ష్మి(80) శామీర్ పేట మండలం దేవర యంజాల్ పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వచ్చి తిరిగి తిమ్మాయపల్లికి వెళ్తుండగా మార్గమధ్యంలోని దొంగల



మైసమ్మ చౌరస్తా వద్ద ఆటో కొరకు వేచి చూస్తున్నాది. గుర్తుతెలియని వ్యక్తి ఇంటి దగ్గర దింపుతానని నమ్మబలికి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని నిర్మానుష్యంగా ఉన్న వెంచర్లోకి తీసుకెళ్లాడు. ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు. పుస్తెలతాడు అపరిచిన వ్యక్తి 25 నుంచి 30 సంవత్సరాల వయసు ఉంటాడని బాధితురాలు పోలీసులకు వివరించింది. దొంగా తెల్లగా ఉంటాడని ఆకుపచ్చ రంగు చొక్కా ధరించాడని, తెలుగులో మాట్లాడుతున్నాడని పోలీసులకు తెలిపింది. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ‘ఎప్పటికో.. కను’మురుగు

హైదరాబాద్: మహానగరం శివారుల్లో మురుగు సంక్షోభం తరుముకొస్తోంది. జలమండలి పరిధి ఓఆర్ఆర్ వరకు విస్తరించిన నేపథ్యంలో విలీన గ్రామాలు, ప్రాంతాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్టీపీలు లేకపోవడంతో పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దాదాపు గ్రామాల్లోని ఇళ్లన్నీ సెప్టిక్‌ట్యాంక్‌లు కలిగి ఉన్నాయి. మురుగునీటి వ్యవస్థ అంతా ఓపెన్ డ్రెయిన్లకు అనుసంధానమయ్యాయి. ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల ఉన్న విలీన గ్రామాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ 20 శాతానికే పరిమితమైంది. ఈ మురుగునీటి డ్రైన్లు కూడా ప్రధాన మురుగునీటి కాలువలకు అనుసంధానం కాలేదు. ప్రధాన ట్రంక్ సీవర్‌లు కేవలం 5 శాతం మాత్రమే ఉన్నాయి. జలమండలి పరిధి.. ఓఆర్ఆర్ వరకు మహానగరం వేగంగా విస్తరిస్తుండటంతో మురుగునీటి వ్యవస్థ అనుసంధానం జలమండలికి సమస్యాత్మకంగా మారింది.

**ప్రాథమిక వ్యవస్థతోపాటు..**

గ్రామాలలో వందశాతం అండర్‌గ్రౌండ్ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు చేసి అనుసంధానించాలి. ప్రధానమైన ట్రంక్ సీవర్ల ఏర్పాటు కావాలి. ఆయా ప్రాంతాల భవిష్యత్ విస్తరణకు అనుగుణంగా మురుగునీటి



వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రస్తుత కనెక్షన్లను అనుసంధానించాలి. ఎస్టీపీలు ఏర్పాటు చేయాలి. ఇదంతా భారీ వ్యయంతో కూడుకున్నది కావడంతో జలమండలి తర్జనభర్జన పడుతోంది. పర్యావరణపరంగా నగరం మెరుగ్గా ఉండాలంటే పటిష్ట మురుగునీటి శుద్ధి విధానం అవసరం.

**సమగ్ర సీవరేజీ విధానం అవసరం**

మూసీ పునరుజ్జీవ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్న నేపథ్యంలో వందశాతం మురుగు శుద్ధి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ లోపల పటిష్ట మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు కీలకమని సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్నారు. కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుతో తప్ప ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లే పరిస్థితి జలమండలికి లేదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అభివృద్ధి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శివారుల్లో పటిష్ట విధానాన్ని రూపొందించాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు.

## స్వీయ పరీక్ష రాసుకో.. తప్పులు సరిదిద్దుకో

మిర్యాలగూడ : వివిధ పరీక్షలు దగ్గర పడుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు తీవ్ర ఆందోళన, ఒత్తిడికి గురవుతుంటారు. ముఖ్యంగా పరీక్షల కోసం ఎలా సన్నద్ధమవ్వాలి..ముందుగా ఏది చదవాలి.. ఎలా చదవాలి అనే సందేహాలు బుర్రలో గింగిరాలు తిరుగుతుండడంతో చదువుపై ఏకాగ్రత చూపలేకపోతుంటారు. అందులోనూ గణితం అంటే తరగతిలోని 50శాతం విద్యార్థులు ఎంతో ఆందోళనకు గురవుతుంటారు. అయితే పరీక్ష ఏదైనా గణితంలో అత్యధిక మార్కులు సాధిస్తేనే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండడంతో గణితం ఎలా చదివి..మంచి మార్కులు సాధించాలో వివరిస్తూ కథనం..

ఈ విధంగా సన్నద్ధం కావాలి..

పరీక్షల కోసం చదివేందుకు తొలుత అధిక మార్కులు ఉండే పెద్ద, కఠిన సమస్యలను ఎంపిక చేసుకోవాలి.

అనంతరం చిన్న, సులభమైన సమస్యలను అధ్యయనం చేయాలి.

పలు పరీక్షల్లో వచ్చే ప్రశ్నలను బాగా అధ్యయనం చేయాలి.

ఫార్ములాలను నిత్యం రివైజ్ చేస్తూ ఉండాలి.

నిత్యం చదివిన వాటిపై స్వీయ పరీక్ష రాసుకోవాలి.

తప్పులు సరిచూసుకుని..ఏమైనా తేడాలుంటే మళ్లీ అధ్యయనం చేయాలి.

ప్రతి గంటన్నరకు పది నిమిషాల విరామం తీసుకోవాలి.

ఒకే సమస్యపై అధిక సమయాన్ని కేటాయించకుండా విషయాన్ని పూర్తిగా అవగతం చేసుకోవాలి.

గణితం చదివేటప్పుడు ఏకాగ్రత ఎంతో ముఖ్యం.

ఏదైనా సమస్య రాకపోతే ఆత్మవిశ్వాసాన్ని సడలనీయకండి.

ప్రాక్టిస్ పేపర్లపై నిత్యం కొంత సమయం కేటాయించండి.

# ప్రతి నీటి చుక్కనూ పట్టేస్తుంది

హైదరాబాద్: నీటి వృథాను అరికట్టేందుకు, మీటర్ రీడింగ్‌ను పక్కాగా లెక్కపెట్టేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ పరిశోధకులు వినూత్న పరికరాన్ని ఆవిష్కరించారు. మన ఇంట్లో జలమండలి అధికారులు ఏర్పాటు చేసే మీటర్‌పైన దీన్ని అమర్చితే చాలు.. మీటర్ రీడింగ్‌ను కెమెరాతో చిత్రీకరిస్తుంది. వై-ఫై పరిజ్ఞానంతో ఇంట్లో ఏర్పాటు చేసిన సర్వర్‌కు సమాచారం పంపుతుంది. ఎన్ని కిలోలీటర్ల నీళ్లు వినియోగించామో తెలుపుతుంది. ఈ పరికరానికున్న సెన్సర్లు నీటి సంపులో ఉన్న నీటి పరిమాణాన్ని చెబుతాయి. రెండేళ్లపాటు పరిశోధించి 'అనలాగ్ మీటర్ రాస్ప్‌బెర్రీ పై కెమెరా' పరికరాన్ని కనుగొన్నామని స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ చీఫ్ అర్కిటెక్టర్ వి.అనురాధ తెలిపారు. ఒక పరికరం తయారీకి రూ.5వేలు ఖర్చయ్యిందని వందలు, వేలల్లో తయారు చేస్తే ఖర్చు తగ్గుతుందని వివరించారు.ఎందుకు కనుగొన్నారంటే.. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సంపుల వద్ద జలమండలి సిబ్బంది అనలాగ్ మీటర్లను



బిగించారు. నెలనెలా వచ్చి మీటర్ రీడింగ్‌లను చూసి బిల్లులు వేస్తుండేవారు. మీటర్ రీడింగ్ ఆగిపోయినా వీరికి తెలిసేది కాదు. స్మార్ట్‌సిటీ లివింగ్‌ల్యాబ్ ఆచార్యులు, విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ద్వారా 'రాస్ప్‌బెర్రీ పై కెమెరా'తో కూడిన అనలాగ్ మీటర్ కెమెరాను రూపొందించారు. వివిధ దశల్లో ప్రయోగాలు చేసి.. తొలుత క్యాంపస్‌లోని రెండు సంపుల్లో పరికరాన్ని అమర్చి రీడింగ్‌ను పరిశీలించారు. ఫలితాలు సంతృప్తికరంగా రావడంతో క్యాంపస్‌లోని సంపుల్లో మీటర్లకు అమర్చారు.

**వృథా అరికడుతుందిలా..**

రాస్ప్‌బెర్రీ పై కెమెరా ద్వారా ప్రతినీటి చుక్కకూ లెక్క ఉంటుంది. ఫలానా బ్లాక్‌లో నీటిని ఎక్కువగా వాడుకుంటున్నారని అప్రమత్తం చేస్తుంది. లీకేజీలుంటే వెంటనే సందేశాలను పంపుతుంది. రోజువారీ నీటి వినియోగాన్ని విశ్లేషించి నిర్ణీత షెడ్యూళ్లలో రిపోర్టులను పంపుతుంది. జలమండలి అధికారుల అభ్యర్థన మేరకు గచ్చిబౌలిలోని ఒక కాలనీలో కొన్ని అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు అనలాగ్ రాస్ప్‌బెర్రీ పై మీటర్లను అమర్చి ఈ కెమెరాల పనితీరు, నీటి వినియోగాన్ని పరిశీలిస్తున్నారు. ఇక్కడ కూడా సంతృప్తికరంగా ఫలితాలొస్తున్నాయని స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్ ప్రతినిధులు వివరించారు.

# తాగునీటి తండ్లాట

వీర్నపల్లి: వేసవి నేపథ్యంలో పల్లెల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తుతోంది. నీటి కటకటతో పంటలు ఎండిపోగా ప్రస్తుతం ప్రజల వంతయ్యింది. గ్రామాల్లో అద్దెబోర్ల వద్ద మహిళలు బారులు తీరుతుండగా.. బుక్కెడు నీటి కోసం గట్ల వెంబడి పరిగెత్తాల్సిన దుస్థితి తండాల్లో నెలకొంది. ముందస్తు చర్యల్లో వైఫల్యం కారణంగా సమస్య జఠిలమైంది.

**ఇబ్బందులు ఎందుకంటే..**

గ్రామాల్లో మిషన్ భగీరథతోపాటు బోరుబావుల ద్వారా రక్షిత మంచినీరు సరఫరాల చేస్తున్నారు. వేసవి ప్రారంభం నుంచి పల్లెల్లో తాగు నీటి సమస్య తీవ్రమవుతోంది. మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని గ్రామ పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. వ్యవసాయానికి విరివిగా భూగర్భ జలాలు వినియాగంతో పంచాయతీల్లో బోర్లు ఎండుముఖం పట్టాయి. ఫలితంగా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉన్నా.. వీర్నపల్లి, మద్దిమల్లతండా, మద్దిమల్ల, బంజేరు, భూక్యతండా, బావుసింగ్ నాయక్‌తండాల్లో సమస్య తీవ్రంగా ఉంది.



**సవాలుగా సమస్య**

గతంలో వేసిన బోర్లు సుమారు 300 నుంచి 500 ఫీట్ల వరకే ఉన్నాయి. అందులో జలాలు ఎండిపోవడంతో గ్రామాల్లోని జల బండాగారాల్లోకి నీటిని నింపడం సవాలుగా మారింది. అంతంత మాత్రంగానే పోస్తున్న భగీరథ జలాలు అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో చాలా గ్రామాల్లో నీటి సరఫరా రెండు, మూడు రోజులకు ఒకసారి జరుగుతుంది. ప్రత్యామ్నాయంగా అద్దె బోర్లను చూసినప్పటికీ ప్రస్తుతం జలాలు అందకపోవడంతో అవికూడా సరిగా నీరు పోయడం లేదు. తండాల్లో గిరిజన మహిళలు పంట పొలాల్లోని బోరు బావుల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు.

సమాధానం కరవు- గుగులోతు పద్మ, గోన్యానాయక్‌తండా

మా తండాకు నీటి సమస్య తీవ్రంగా ఉంది. ఇదేంటని అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా సరైన సమాధానమే లేదు. పని మానుకొని 12 కుటుంబాలకు చెందిన మహిళలం 400 మీటర్‌ల దూరంలో పెద్దవాగు ఒడ్డున బోరుబావి ద్వారా తెచ్చుకుంటున్నాం.

బిందె నీళ్లు రావడం లేదు - పిట్ల లక్ష్మి, సుభాష్‌నగర్, వీర్నపల్లి

నాలుగు నెలల నుంచి మా కాలనీకి తీవ్రమైన నీటి సమస్య ఉంది. ధర్నా చేస్తే ఆ ఒక్క రోజే నీళ్లు ఇస్తున్నారు. అధికారులు మొక్కుబడి చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. నాలుగు రోజులకోసారి నల్లా వస్తున్నా ఒక్క బిందె నిండడం లేదు.

# 3.5 లక్షల దరఖాస్తులు..300 లోపు పరిష్కారం



హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ నత్తను తలపిస్తోంది. ఏడు జిల్లాలు ఆరు జోన్ల పరిధిలో 3.5 లక్షల దరఖాస్తులు రాగా.. ఇందులో ఇప్పటివరకు 300 దరఖాస్తులలోపే పరిష్కరించి ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు తెలుస్తోంది. మార్చి 31వ తేదీలోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇవ్వనుండటంతో చాలామంది ముందుకు వస్తున్నారు. ప్రక్రియ వేగంగా సాగకపోవడంతో వెనక్కి తగ్గుతున్నారు. సాంకేతిక సమస్యలు పెద్ద అడ్డంకిగా మారుతున్నాయని హెచ్‌ఎండీఏ సిబ్బందే చెబుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌తో భారీ ఆదాయం సమకూరుతుందని భావించిన అధికారులకు నిరాశే ఎదురవుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభావం పడుతోంది. ముఖ్యంగా డైరెక్టర్లు, పీవోలు సరైన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి. క్షేత్రస్థాయిలో సమీక్ష కూడా జరగడం లేదు.

ఎల్‌ఆర్‌ఎస్, వివిధ సమస్యలపై వస్తున్న దరఖాస్తుదారులను హెల్ప్ డెస్క్ నుంచి అధికారుల వద్దకు పంపుతున్నారు. అయితే అక్కడ ఎవరూ కలవడం లేదని వారు వాపోతున్నారు. దీంతో రూ.లక్షలు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. కొందరైతే తర్వాత చూద్దాంలే అని విరమించుకుంటున్నారు. ఇప్పటివరకు 5 శాతం మంది కూడా ఫీజులు చెల్లించలేదని ఓ అధికారి తెలిపారు.

**స్పష్టత ఎక్కడ?**

ఫీజు చెల్లించిన తర్వాత ఎప్పటిలోగా ప్రొసీడింగ్స్ ఇస్తారో అధికారులు చెప్పలేకపోతున్నారు. ఫలితంగా చాలామంది ముందుకు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఒకే సర్వే నంబరు, పక్కపక్కనే ఉన్న ప్లాట్లకు సంబంధించి వేర్వేరుగా ప్రభుత్వ మార్కెట్ ధరలు ఉంటున్నాయి. ఒక చోట చదరపు గజం రూ.300 ఉంటే.. పక్కనే ఉన్న ప్లాటు చదరపు గజానికి రూ.15-20 వేలు చూపుతుండటంతో అవాక్కవుతున్నారు. మార్కెట్ ధర భారీగా ఉంటే...వాటిపై చెల్లించే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు ఎక్కువగా ఉంటాయి. దీంతో డబ్బులు కట్టడానికి సిద్ధపడటం లేదు. ఆరా తీస్తే...సాంకేతిక సమస్యలే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. వాటిని సరిచేసే ప్రయత్నం చేయడం లేదు. కొన్ని దరఖాస్తులకు ఎల్-1 పెండింగ్ అని చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించి అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని తేల్చిన తర్వాతే ఎల్-1కు క్లియరెన్సు వస్తుంది. ఇప్పటికే దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్‌కు పంపినా అక్కడ పట్టించుకునే నాథుడు ఉండటం లేదు. మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల వల్ల మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు.

# స్వచ్ఛత మరిచె.. మురుగు నిలిచె



పరిగి : జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో పాలక వర్గం గత జనవరిలో ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుండగా పర్యవేక్షణ లోపం, సిబ్బంది కొరత తదితర కారణాలతో పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడంలేదు. దీంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. తడి, పొడి చెత్త వేరుచేయడం లేదు. మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. స్వచ్ఛత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉంటే స్వచ్ఛతో ర్యాంకు ఎలా సాధించగలమని పౌరులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో 'పరిశీలన' కథనం

**దశాబ్దాలనాటి కాలువలే నేటికీ దిక్కు**

వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకించి వార్డు అధికారులను నియమించింది. కానీ వారు కార్యాలయ పనులకే పరిమితం కావడంతో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. ఓవైపు రోజు రోజుకు జనాభా పెరుగుతున్నా అన్ని మున్సిపాలిటీల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన మురుగు కాల్వలే నేటికీ ఆధారంగా నిలిచాయి. దీంతో చాలా చోట్ల మురుగు నిలిచి పోతోంది. పరిగిలో ప్రధానంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ కేంద్రానికి సమీపంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో పారబోస్తున్నారు.

**పేరుకే జిల్లా కేంద్రం**

వికారాబాద్ పట్టణ కేంద్రంలో నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు తిరుగుతుంటారు. అలాంటిది రోడ్ల వెంబడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉంటున్నా సిబ్బంది తొలగించడంలేదనే విమర్శలున్నాయి. సగం సిబ్బంది లేకపోగా ఉన్న వారిలో కొందరు ఇతర విభాగాల్లో పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికీ కార్మికులు తక్కువగానే ఉన్నారు. **డంపింగ్ యార్డు సమస్యతో ఇబ్బంది**

మున్సిపల్‌లోని గాంధీనగర్ కాలనీకి సమీపంలో చించోళి,భూత్పూర్ జాతీయ రహదారి పక్కనే చెత్తదిబ్బ ఉండటంతో తడి,పొడి చెత్తను కలిపి వేస్తున్నారు.ఇక్కడున్న రెండు వసతి గృహాలతో పాటు గాంధీనగర్, ఆర్యనగర్ కాలనీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

**వార్డుల్లో వీధులు అపరిశుభ్రం**

తాండూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి వార్డుల్లో వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. చెత్త తరలించేందుకు తెచ్చిన వాహనాలు కొన్ని పనిచేయడంలేదు. మురుగు కాల్వలు చెత్తతో నిండిపోతున్నాయి.

# పేరుకే చెట్టు.. పర్యావరణానికి చేటు



వికారాబాద్: పర్యావరణ రక్షణ, వాతావరణ సమతుల్యతలో వృక్షాల పాత్ర వెలకట్టలేనిది. ప్రభుత్వం సైతం హరితహారం పేరిట యేటా పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలో వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ పురపాలికల్లో కూడా 'కోనో కార్పస్' మొక్కలు నాటారు. కానీ పక్షులు వాలని, పశువులు తినని వృక్షాలుగా వీటికి గుర్తింపు ఉండటం ఆందోళనకరం. పర్యావరణానికి హాని కలిగించే వీటిని రాష్ట్ర వ్యాప్తంగా తొలగించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మంగళవారం జరిగిన శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**జిల్లా వ్యాప్తంగా 8 లక్షలు**

హరిత హారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 8 లక్షల కోనో కార్పస్ మొక్కలను పార్కులు, రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలు, చెరువు గట్లు తదితర ప్రాంతాల్లో నాటారు. అన్ని పట్టణాలు, ప్రైవేటు వెంచర్లు, పెట్రోల్ బంకులు, గ్రామాల్లో, గృహ సముదాయాల్లో ప్రస్తుతం పెరిగి పెద్దవై భారీ వృక్షాలను తలపిస్తున్నాయి.

**నిపుణులు ఏం చెబుతున్నారంటే..**

తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తులో ఏపుగా కోనో కార్పస్ మొక్కలు పెరుగుతాయి. వీటివల్ల జరిగే నష్టం తెలుసుకుని విదేశాల్లో నిషేధించారు.

కోనో కార్పస్ వృక్షాల పుప్పొడి అత్యంత ప్రమాదకరమైంది. కరోనా సోకిన వ్యక్తి శ్వాసకోశ సమస్యలతో ఎలా ఇబ్బందులు పడతారో ఈ చెట్ల నుంచి పీల్చుకునే గాలి వల్ల అంతటి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

80 మీటర్ల లోతు వరకు వీటి వేర్లు వ్యాపించి భూగర్భ జలాలను పీల్చేస్తాయి.

జంతువుల మేతకూ ఉపయోగపడవు

కోనో కార్పస్ మొక్కలపై పక్షి వాలదు, జంతువుల మేతకూ ఉపయోగపడవు. ప్రజలకు లేని జబ్బులు తెచ్చి పెడతాయి. వీటిని ఎక్కడ ఉన్నా వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరాను.

గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభాపతి

**నాటడం నిలిపివేశాం..**

కోనో కార్పస్ మొక్కలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిసిన తరువాత జిల్లాలో వాటిని నాటడం నిలిపి వేశాం. పట్టణాల్లో పలు చోట్ల ఈ చెట్లను తొలగించి, వీటి స్థానంలో వేరే మొక్కలను నాటుతున్నాం. జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారి

# ఉపాధిలో.. ప్రథమం

వికారాబాద్ : వలసలు నివారించి పల్లెల్లో నివసిస్తున్న ప్రజలకు పనులు కల్పించి వారికి ఉపాధి చూపించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. దీన్లో భాగంగా జిల్లా ముమ్మరంగా కూలీలకు పనులు కల్పించి ప్రథమంగా నిలవడంతో ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.ఇతర ప్రాంతాలకు ఆగిపోయిన వలసలు : జిల్లాలోని పరిగి, కుల్కచర్ల, దోమ, మోమిన్‌పేట, తదితర మండలాలకు చెందిన గ్రామీణులు ప్రతిసారి ఉపాధి కోసం ముంబయి, హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్రలోని పట్టణాలకు వెళ్తుంటారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించటంతో కూలీలు దీనివైపు మొగ్గుచూపారు. పనుల




కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లటం తగ్గించారు. ఈ ఆర్థిక సంవత్సరం గ్రామీణ అభివృద్ధి శాఖ దశల వారీగా 1.90 లక్షల మంది కూలీలకు పనులు కల్పించి రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిచింది.

ఇకముందూ కొనసాగిస్తాం: శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఉపాధి హామీ పథకం పనుల అమలులో అనేక సూచికల్లో జిల్లా ప్రథమ స్థానం దక్కింది. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, సిబ్బంది ఎంతో సమన్వయంతో పనిచేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం.

ఈ సూచికల్లో గుర్తింపు2024-25లో 1,08,480 కుటుంబాలకు, 1,90,091మంది కూలీలకు దాదాపు 63.66 లక్షల పనిదినాలు కల్పించారు. 6,581 కుటుంబాలకు 100 రోజుల పనికల్పించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. 100రోజులకు సగటుగా 59 పనిదినాలు కల్పించడంతో మొదటి స్థానం దక్కింది.ప్రస్తుతం పని చేస్తున్న కూలీలు: (ఈనెల 22 నాటికి)28,824మంది.

# లక్ష్యానికి చేరువగా పంచాయతీలు

కోరుట్ల: జిల్లాలోని గ్రామపంచాయతీలు ఆస్తి పన్ను బకాయిల వసూళ్లలో దూసుకుపోతున్నాయి. మొత్తం గ్రామాల్లో శతశాతం తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. రోజూ పన్ను బకాయిదారుల ఇళ్లకు వెళ్లి పూర్తిస్థాయిలో కట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 20 మండలాలు.. 385 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇప్పటివరకు జగిత్యాల మండలంలో అత్యధికంగా 101 శాతం పన్నులు వసూలు చేశారు. అత్యల్పంగా కొడిమ్యాల మండలంలో 93 శాతం వసూలయ్యాయి. జిల్లా మొత్తం కలిపి 97 శాతం వసూలు చేశారు. వారం రోజులు గడువు ఉండటంతో వంద శాతం పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.



**కనిపించని అభివృద్ధి పనుల జాడ**

గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు 2024 జనవరి 31తో ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో నిధుల లేమితో అభివృద్ధి కుంటుపడటంతోపాటు మౌలిక వసతుల కల్పన కష్టంగా మారింది. గతంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ నిధులు కేటాయించేవి. వీటితోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేవారు. అయితే పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం గడువు తీరడంతో ఏడాదికిపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. ఇంటి కుళాయి పన్నులు, ఇతర లైసెన్స్ ఫీజుల ద్వారా వచ్చే చాలిచాలనీ నిధులతోనే గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ట్రాక్టర్‌లలో డీజిల్ తదితర పనులు చేపడుతున్నారు. ఆయా నిధులనే మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించుకుంటున్నారు. ఈ నిధులు సరిపోకపోవడంతో కొన్ని పంచాయతీల అధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నిచోట్ల ఏడాదికాలంగా అభివృద్ధి పనుల జాడ కనిపించకుండా పోయింది.

# పురం.. స్వచ్ఛత ప్రశ్నార్థకం!

సంగారెడ్డి : జిల్లాలోని పలు పురాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. చెత్త సేకరణలో నిత్యం నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డంప్ యార్డులు నిరుపయోగంగా మారడంతో చెత్త పేరుకుపోతోంది. స్వచ్ఛ పట్టణాలుగా మార్చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. బొల్లారం, ఖేడ్‌లో మాత్రమే మెరుగ్గా ఉంది. **అందరూ పొరుగుసేవల సిబ్బందే..**

ఖేడ్ పుర పరిధిలో పారిశుద్ధ్య విభాగం అధికారితోపాటు మరో 42 మంది కార్మికులున్నారు. అందరూ పొరుగు సేవల కిందే పనిచేస్తున్నారు. ఆటోల ద్వారా నిత్యం ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. జూకల్ శివారులోని చెత్తదిబ్బలో ఎరువులు తయారు చేస్తున్నారు. బొల్లారం పురాలికలో పారిశుద్ధ్య సమస్య లేదు. సేకరించిన చెత్తను పట్టణ శివారులోని గాంధీనగర్‌లో వేస్తున్నారు.

**జిల్లా కేంద్రం.. అపరిశుభ్రం**

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా మారింది. పారిశుద్ధ్య పర్యవేక్షకుడి పోస్టు మూణ్నెల్లుగా ఖాళీగా ఉంది. పట్టణంలోని వ్యాపార కూడళ్లతోపాటు కాలనీల్లో చెత్తాచెదారం కనిపిస్తోంది. ప్రధాన రహదారిపై మాత్రమే పూర్తిగా సేకరిస్తున్నారు. రోడ్డుపై చెత్త వేసే వారికి జరిమానా విధించాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదు.

**ఈగలు, దోమలు, దుర్వాసన..**

జిల్లాలోని పెద్ద పట్టణాల్లో ఒక్కటైన జహీరాబాద్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కార్యాలయంలో, క్షేత్రస్థాయిలో పనిచేసే వారు 224 మంది కార్మికులు అవసరం కాగా.. ప్రస్తుతం వంద పైచిలుకు మాత్రమే ఉన్నారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ మరో పురపాలికలో పనిచేస్తున్నారు. వేరే అధికారికి ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. ఈగలు, దోమలు, వాసనతో పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ

భగత్‌నగర్: యాసంగి 2024-25కు ధాన్యం కొనుగోలుకు అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. కొనుగోలు లక్ష్యం 3.6 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 336 కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఇటీవల జిల్లాలోని పలు మండలాల్లో అకాల వర్షాలతో కొంత మేర పంట నష్టం వాటిల్లింది. కొనుగోలు లక్ష్యానికి కొంత గండిపడే అవకాశముంది. సాధారణంగా వేసవిలో రైతులు దొడ్డు రకం ధాన్యం పండిస్తారు. సన్నాలు వేస్తే ధాన్యం మర ఆడించిన సమయంలో ముక్కలవుతాయి. ఈ నేపథ్యంలో వేసవిలో సన్నాలు కొనుగోలు ప్రభుత్వానికి భారమే.

**336 కేంద్రాలు..**

యాసంగి ధాన్యం కొనుగోలు చేయడానికి జిల్లాలో 336 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఐకేపీ-48, పాక్స్-239, డీసీఎంఎస్-45, హాకా-4ల ఆధ్వర్యంలో ప్రారంభించబోతున్నారు. వీటిలో సన్న, దొడ్డు రకాల వడ్లను కొనుగోలు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు కావాల్సిన ఏర్పాట్లు చేసేందుకు ఆయా శాఖల మధ్య సమన్వయంతో పని చేయబోతున్నారు.

సాధారణంగా యాసంగిలో అకాల వర్షం భయం వెంటాడుతుంది. ఒక్కోసారి ఆరుగాలం శ్రమ వరదపాలు అయ్యే అవకాశముంటుంది. ప్రభుత్వ ఖర్చులతో వరికుప్పలపై కప్పడానికి టార్పాలిన్లను సమకూర్చు



తున్నారు. కొనుగోలు కేంద్రాలకు 7472 టార్పాలిన్ అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 4955 సమకూర్చుకున్నారు. మిగతా వాటిని సమకూర్చుకునే పనిలో ఉన్నారు. సన్నరకాలను కొలిచేందుకు గ్రైన్ కాలిఫర్లు హస్క్ రిమూవర్లు అందుబాటులో ఉన్నాయి.

**సన్నవి కొలవడమే సమస్య**

సన్న బియ్యాన్ని నిర్ధారించడానికి వడ్లను హస్క్ రిమూవర్‌తో పొట్టి తొలగించి, గ్రెయిన్ కాలిఫర్‌తో గింజను కొలుస్తారు. గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్న తక్కువ, వెడల్పు 2 మిల్లీమీటర్ల కన్న తక్కువ ఉండాలి. ఇది వ్యవసాయాధికారులు నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. ఒక్కో వ్యవసాయాధికారికి అయిదారు కేంద్రాల బాధ్యత అప్పగిస్తున్నారు. ఆయా కేంద్రాలకు వెళ్లి నిర్ధారణ చేయడం ఆలస్యమవుతోంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి కాలహరణం జరగకుండా చూడాల్సిన అవసరముంది.

లక్ష్యం 3.6 లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 2,66,896 ఎకరాల్లో వరి సాగు చేశారు. దొడ్డు రకం 1,99,051 ఎకరాల్లో, సన్నరకపు 67,845 ఎకరాల్లో సాగు చేశారు. దొడ్డు రకం 4,57,817 మెట్రిక్ టన్నులు, సన్నరకం 1,28,906 ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. స్థానిక వినియోగానికి దొడ్డు బియ్యం 1,82,871 మెట్రిక్ టన్నులు, సన్నరకం 43,842 మెట్రిక్ టన్నులు వినియోగమవుతుందని ఊహించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు దొడ్డు ధాన్యం 2,74,946 మెట్రిక్ టన్నులు, సన్న రకం 85,054 మెట్రిక్ టన్నులు తీసుకొచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాగితాల్లో నిషేధం.. అమలులో నిర్లక్ష్యం

జగిత్యాల : రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బీటీ-3 పత్తిని సాగు చేయవద్దని పేర్కొన్నా.. గత వానాకాలంలో ఈ నిషేధం అమలు కాలేదు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో బీటీ-3 విత్తనాలు పండించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విత్తనాల పట్ల రైతుల ఆసక్తినిబట్టి పలు ప్రాంతాల్లో బీటీ-2 విత్తనాలను కూడా బీటీ-3 పేరిట అమ్మినట్లు గుర్తించారు. సాధారణంగా బీటీ-3 విత్తనాలతో పండించిన పంటపై గ్లైఫోసేట్ గడ్డిమందును పిచికారీ చేసినా పంట మొక్కలకు ఎలాంటి హాని జరగకపోగా కలుపు పూర్తిగా తొలగిపోతోంది కానీ.. బీటీ-2 విత్తనాలను బీటీ-3 పేరిట సాగుచేసి గ్లైఫోసేట్‌ను పిచికారీ చేస్తే పంటంతా ఎండి తీవ్రంగా నష్టపోతారు. నిషేధిత గ్లైఫోసేట్ గడ్డిమందును చాలామంది వాడుతున్నారు. గ్లైఫోసేట్ను వాడినప్పుడు మనుషుల ఆరోగ్యాలు దెబ్బతినడంతోపాటు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**పకడ్బందీ చర్యలు అవసరం**

ముందుగా ఆవిష్కరించిన బీటీ-1 విత్తనాలు తలనత్త, గులాబీరంగు, సెనగపచ్చ పురుగును తట్టుకున్నాయి. బీటీ-2 విత్తనాలు లద్దెపురుగులను కూడా తట్టుకునే శక్తిని కలిగి ఉన్నాయి. బీటీ-3 వీటన్నింటితోపాటు కలుపు నివారణ రసాయనాన్ని తట్టుకొని అధిక దిగుబడి ఇస్తుందని పేర్కొన్నా.. శాస్త్రీయంగా మనదేశంలో నిరూపణ కానందున సాగు చేయొద్దని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గత పంట కాలాల్లో బీటీ విత్తనాలపైనా చీడపీడలు ఆశించటం బీటీ విత్తనాల సామర్థ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది.

కొన్నిచోట్ల బీటీ విత్తుల పేరిట నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోని పత్తిగింజలకు రంగులు పట్టించి అందమైన కవర్లలో, డబ్బాల్లో నింపి ప్రముఖ కంపెనీల లేబుళ్ల పేరిట గుట్టుగా విక్రయాలు సాగిస్తారు. జిన్నింగ్ మిల్లుల్లో నుంచి పత్తిగింజలను అతి తక్కువ ధరకు తీసుకొచ్చి విత్తనాలుగా చలామణి చేసినప్పుడు అధిక లాభం వస్తుండటంతో మోసగాళ్లు నకిలీ విత్తనాల చలామణి చేపడుతున్నారు. లాభం ఎక్కువగా వస్తుందని వ్యాపారులు, జేబులు నిండుతాయని కొన్నిచోట్ల అధికారులు సహకరిస్తుండటంతో నకిలీ విత్తనాలు యథేచ్ఛగా రైతుల క్షేత్రాలకు చేరుతున్నాయి. నకిలీ విత్తనాల మొక్కలు మొలిచి ఎదిగినా కాయలు అతితక్కువగా వచ్చి దిగుబడి సగానికి పడిపోతుంది. చీడపీడల ఉధృతి పెరిగి సస్యరక్షణ ఖర్చు పెరగటంతో ఏమాత్రం గిట్టుబాటు కాదు. పల్లెల్లో జీరోగా విత్తనాలను అమ్మటం, కొన్ని దుకాణాల్లో బిల్లులు ఇవ్వనందున రైతులు నష్టపోయిన సందర్భాల్లో కనీసం ఫిర్యాదుకు కూడా నోచుకోవటం లేదు. వచ్చే వానాకాలంలో వరికి బదులుగా పత్తి తదితర ఆరుతడి పంటల సాగు పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినందున వ్యవసాయశాఖ, పోలీసు అధికారులు ఇప్పట్నుంచే దృష్టిసారించి బీటీ-3 విత్తనాలు, నకిలీ పత్తి విత్తనాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాల్సి ఉంది.

# ఎండకు ఎండాల్సిందే



హైదరాబాద్: వేసవి సమీపిస్తున్న వేళ ఆర్టీసీ ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. అవసరమైన బస్‌షెల్టర్లు లేక ఎండలో నిరీక్షిస్తున్న పరిస్థితి. పేరుకే ఉన్న కొన్ని ఏసీ బస్‌షెల్టర్లు మందుబాబులకు అడ్డాలుగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల విద్యుత్తు సరఫరా లేక పాడైన ఫ్యాన్లు, ఏసీలు దర్శనమిస్తున్నాయి. గ్రేటర్‌లో 2800కి పైగా బస్సుల్లో నిత్యం 20లక్షల మంది ప్రయాణాలు సాగిస్తుండగా 2200 బస్‌షెల్టర్లకు 1370 మాత్రమే ఉన్నాయి. 200 ప్రాంతాల్లో నిర్మించడం తప్పనిసరి అంటూ గ్రేటర్ ఆర్టీసీ అధికారులు జీహెచ్‌ఎంసీకి విన్నవించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

**ఆరు బయటే నిరీక్షణ..**

మెహిదీపట్నంలో రైతుబజార్ వైపు ఉన్న బస్‌షెల్టర్లలో విరిగిన కుర్చీలు, బల్లలే దర్శనమిస్తున్నాయి. ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రయాణికులు ఎక్కడ బస్సు ఎక్కుతారో సర్వే చేయకుండా బస్‌షెల్టర్లు నిర్మించడంతో చాలావరకు నిరుపయోగంగా మారిపోయాయి.

హిమాయత్‌నగర్ రోడ్డు, నారాయణగూడ, కాచిగూడ, అమీర్‌పేట, కోఠి, ఉప్పల్, బీహెచ్‌ఈఎల్ మార్గంలో అవసరమైన చోట షెల్టర్లు లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి నిర్మించారు.

లింగంపల్లి నుంచి చందానగర్ మార్గంలోనూ కొత్తగా నిర్మించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఫలక్‌నుమా ఇంజిన్‌బౌలి మార్గంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏసీ బస్‌షెల్టర్ల పరిస్థితి..

డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ (డీబీఎఫ్‌వోటీ) పద్ధతిలో ఏసీ బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎస్పీరోడ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, మలక్‌పేట్‌లోని ఏసీ బస్‌షెల్టర్లలో నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. డిజైన్‌లోపం ఉండటం, వచ్చే బస్సులు కనిపించకపోవడంతో షెల్టర్ బయటే వేచి చూస్తున్నారు. కొన్నిచోట్ల దుకాణాలకు అద్దెకిచ్చారే తప్ప నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కూకట్‌పల్లిలో రాత్రయితే మందుబాబులు ఇందులో తిష్ఠవేస్తున్నారు.

# కోర్టు చెప్పినా..మురుగు పరుగే!



హైదరాబాద్ : ఏడాది కిందట.. అంటే మార్చి 19, 2024న.. హైకోర్టు నియమించిన ఇద్దరు సభ్యుల అడ్వకేట్ కమిషన్ నగరంలోని 13 చెరువులను తనిఖీచేసింది. ఆక్రమణలు, కలుషిత నీరు, నిర్మాణ వ్యర్థాల డంపింగ్ వంటి సమస్యలను గుర్తించింది. చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. 4 వారాల్లో చర్యలు తీసుకోవాలని గడువు నిర్దేశించినా బల్దియాలో చలనం లేదు. మురుగునీటిని దారి మళ్లించేందుకు చేపట్టిన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. నిర్మాణ వ్యర్థాల డంపింగ్, ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. చందానగర్‌లోని గంగారం చెరువు ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.

**ఏడాది పొడవునా మత్తడి**

అడ్వకేట్ కమిషన్ తనిఖీచేసిన చెరువుల్లో.. దుర్గంచెరువు, మేడికుంట, సున్నంచెరువు, బోయిన్‌చెరువు, అంబీర్‌చెరువు తదితర తటాకాలు ఏడాది పొడవునా మత్తడి పోస్తుంటాయి. వాటిలోకి రోజూ లక్షలాది లీటర్ల మురుగు చేరుతోంది. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు, మూసాపేట మైసమ్మ చెరువు, కైత్లాపూర్‌లోని కాముని చెరువు, ముళ్లకత్వ చెరువు, హుస్సేన్‌సాగర్, ఇతరత్రా తటాకాలదీ అదే పరిస్థితి.

**తనిఖీ చేసిన తటాకాలివే:** మాదాపూర్‌లోని దుర్గం చెరువు, కూకట్‌పల్లిలోని సున్నంచెరువు, హైదర్‌నగర్‌లోని అంబీర్ చెరువు, నానక్‌రాంగూడలోని మేడికుంట, గౌలిదొడ్డిలోని గోసాయ్‌కుంట, నల్లగండ్లలోని పెద్దచెరువు, చందానగర్‌లోని గంగారం పెద్దచెరువు, సరూర్‌నగర్ బైరామల్‌గూడలోని మద్దెలకుంట, ఉప్పల్‌లోని నల్లచెరువు, ఫీర్జాదిగూడలోని పెద్దచెరువు, దుండిగల్‌లోని చిన్నదామర చెరువు, బోయిన్‌పల్లిలోని బోయినచెరువు, అల్వాల్‌లోని చిన్ననారాయణుని చెరువు.

**ఇప్పుడు పరీక్షిస్తామంటున్న బల్దియా**

అడ్వకేట్ కమిషన్ తనిఖీలు జరిగిన ఏడాదికి.. ఆయా చెరువుల్లో నీటి నాణ్యతను పరీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ 'నీరి'తో ఒప్పందం చేసుకుంటున్నామని, అందుకుగాను రూ.55లక్షలు నీరి సంస్థకు చెల్లించాలని నిర్ణయించామని జీహెచ్‌ఎంసీ చెబుతోంది.

**ప్రస్తుతం ఇదీ పరిస్థితి**

దుర్గం చెరువు పరిస్థితి మారలేదు. మురుగు చెరువులో కలవకుండా తీసుకున్న చర్యలు ఫలించలేదు. ఇనార్బిట్ మాల్ వద్ద మురుగు కలుస్తోందని స్థానికులు గగ్గోలుపెడుతున్నారు.

గంగారం పెద్ద చెరువును ఆక్రమించే ప్రయత్నాలు ఆగట్లేదు. తాజాగా కొందరు నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తంచేశారు.

నానక్‌రాంగూడలోని మేడికుంట ఏడాదిలో ఎప్పుడు చూసినా నిండుగా కనిపిస్తుంటుంది. డ్రైనేజీ కలవడంతోనే అని స్థానికులు చెబుతున్నారు. చెరువు బఫర్‌జోన్‌లో లేబర్ షెడ్లు ఏర్పాటయ్యాయి.

గౌలిదొడ్డిలోని గోసాయ్‌కుంటలో కొంత శిఖం పట్టా భూమి ఉంది. బఫర్ జోన్‌లో నిర్మాణాలున్నాయి. ఓ ప్రముఖ స్థిరాస్తి సంస్థ ప్రహరీ నిర్మించింది. పలు ఇతర ఆక్రమణలూ వచ్చాయి.

హైదర్‌నగర్‌లోని అంబీర్ చెరువు.. కొత్త ఆక్రమణలు లేకపోయినా మురుగును దారి మళ్లించే పనులు జరగలేదు.

బోయిన చెరువు.. కొత్త ఆక్రమణలు లేవు. మురుగును దారి మళ్లించే పనులు పూర్తయినా, నీటి మట్టం తగ్గపోవడంతో మురుగు కలుస్తోందనే విమర్శలున్నాయి.

చిన్ననారాయణుని చెరువులో మురుగుకాలువ పైపులైను నిర్మాణం జరుగుతున్నప్పుడే ఆక్రమణలు జరిగాయి. కట్టడాలు వెలిశాయి. జానకినగర్, ఆనంద్‌నగర్, ఇతరత్రా కాలనీలవైపు పెద్దఎత్తున నిర్మాణ వ్యర్థాలతో చెరువును కప్పేశారు.

# కన్నేసి.. కలిపేసి



హైదరాబాద్ : బాహ్యవలయ రహదారి పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని ఆక్రమించేస్తున్న కొందరు అక్రమార్కులు.. కొద్దినెలల నుంచి శంషాబాద్ సమీపంలోని అమ్మపల్లి గ్రామంలో మిగులు భూముల(సర్‌ప్లస్)పై కన్నేశారు. సర్వేనంబర్ 19లో వంద ఎకరాలకుపైగా సర్‌ప్లస్ భూములుండగా... అదే సర్వే నంబర్‌లో ఇరువైపులా ప్రైవేటు పట్టాలుండడంతో వాటి పక్కనే ఉన్న మిగులు భూములకు తప్పుడు పత్రాలు సృష్టించి లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. ఇప్పటికే రూ.600కోట్ల విలువైన 30 ఎకరాలను ఆక్రమించుకున్నారని సమాచారం. ఈ భూములు రాళ్లగూడ ఓఆర్ఆర్ జంక్షన్‌కు రెండు కి.మీ.ల దూరంలో ఉండడంతో ప్లాట్లను వేగంగా అమ్ముకుంటున్నారు.

**నిబంధనలకు విరుద్ధం..** అమ్మపల్లి గ్రామంలో లేఅవుట్లు వేయడం, భవనాలు నిర్మించడం జీవో నంబర్ 111ను ఉల్లంఘించడమే. ఈ జీవో ప్రకారం శంషాబాద్ మండలమంతా బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదు. ఇల్లు కట్టుకోవాలంటే ప్రైవేటు పట్టాభూమి విస్తీర్ణంలో 90శాతం భూమిని వదిలేసి కట్టుకోవాలి. ఇందుకు భిన్నంగా కొన్నిచోట్ల బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. ఆక్రమించిన భూముల్లో ఫంక్షన్ హాళ్లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ అంశంపై రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డిని వివరణ కోరగా.. సర్వేనంబర్ 19లో మిగులు భూములతో పాటు కొన్ని ప్రైవేటు పట్టాభూములు న్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. **పట్టాభూములేనంటూ విక్రయాలు..** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కూడ గ్రామపరిధి అమ్మపల్లి రెవెన్యూ సంఖ్య 19లో వంద ఎకరాలకు పైగా సీలింగ్ సర్‌ప్లస్ భూములున్నాయి. ఏళ్లుగా ఇవి ఖాళీగా ఉండటంతో కొందరు వీటిని సొంతం చేసుకునేందుకు 9నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. విమానాశ్రయానికి 10 కి.మీ దూరంలో ఉండడంతో లే-అవుట్లు వేసి విక్రయిస్తే కొన్నవారు సులభంగా ఇళ్లు కట్టుకోవచ్చంటూ ప్రచారం చేస్తున్నారు. మిగులు భూముల్లో అనధికారికంగా సాగు చేసుకుంటున్న రైతులకు ఎంతోకొంత ముట్టజెప్పి ఆ స్థలాలనూ ఆక్రమించారు. ప్రహరీలు నిర్మించి ఈ భూములు తమవేనంటూ బోర్డులు పెడుతున్నారు.

# జన సాంద్రత.. నేర తీవ్రత

హైదరాబాద్: ఐటీ కారిడార్‌లో నేరాల సంఖ్య పెరుగుతోంది. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. గచ్చిబౌలి ఠాణాలో జనవరి, ఫిబ్రవరిలో 336 కేసులు నమోదయ్యాయి. సగటున రోజుకు 5 రికార్డయ్యాయి. నార్సింగి ఠాణా పరిధిలో 2 నెలల్లో 389 కేసులు నమోదయ్యాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం వల్లే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. నమ్మకద్రోహం (చీటింగ్), ఆర్థిక తగాదాలు, ఉద్యోగ మోసాలు, అదృశ్యం, రోడ్డు ప్రమాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. విభజిస్తేనే తగ్గుదల గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండేది. కొత్తగా ఫిల్మ్‌నగర్, మధురానగర్, బోరబండ ఠాణాలు రావడంతో కేసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ఐటీ కారిడార్‌లో కొత్తగా కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఠాణాలను ప్రతిపాదించారు. అవి వస్తే నిఘా పెరిగి నేర నియంత్రణ సులువుగా మారుతుందని అధికారులు తెలిపారు.



జనసాంద్రత అంతర్జాతీయ, దేశీయ సంస్థలు.. భిన్న ప్రాంతాల ప్రజలు.. అత్యధిక జనసాంద్రత.. వీటితోపాటే ఆర్థిక వివాదాలు.. సైబర్ నేరాలు ఐటీ కారిడార్‌లో ఎక్కువ నేరాల నమోదుకు కారణమవుతోంది. ఇక్కడితో పోలిస్తే జగద్గిరిగుట్ట, రాజేంద్రనగర్ ఠాణాల పరిధిలో జనసాంద్రత ఎక్కువ. ఇతర రాష్ట్రాల కూలీలు ఉంటున్నారు. ఇలాంటి చోట్ల సైబర్ నేరాలు, ద్విచక్రవాహనాల చోరీలు, ఆర్థిక తగాదాలు తక్కువగా ఉంటాయి. ఐటీ కారిడార్ పరిధిలోని మూడు ఠాణాల పరిధిలో అత్యధికులు విద్యావంతులు. ఏ సమస్య వచ్చినా పోలీసులను ఆశ్రయిస్తుండటంతో ఎక్కువ కేసులు నమోదవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతంలో ఫిర్యాదు దశలో రాజీ ప్రయత్నాలు జరిగేవని హైదరాబాద్ కేంద్రంగా దాదాపు 2 వేల ఐటీ సంస్థలు పనిచేస్తుంటే సుమారు 95 శాతానికి పైగా ఐటీ కారిడార్ కేంద్రంగానే నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 5 లక్షల మందికిపైగా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు.

జనవరి, ఫిబ్రవరి నెలల్లో నేరాలివీ..

గచ్చిబౌలి 336 మాదాపూర్ 314 రాయదుర్గం 173 నార్సింగి 389

# తీరు మారితే.. తీరుతుంది దాహార్తి

తాండూరు, పరిగి: ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం పంప్‌హౌస్‌లు, తాగునీటి ప్రాజెక్టులు చేపడుతోంది. వీటి నిర్వహణ సక్రమంగా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి తనిఖీలు చేపట్టక పోవడం, అవసరమైన మరమ్మతులు నిర్వహించక పోవడం తదితర కారణాలతో పథకాలు వృథాగా మారుతున్నాయి. నిదర్శనంగా నిలుస్తున్నాయి ఈ పంప్‌హౌస్‌లు.

**కాగ్నా నది ఆధారంగా రెండు ఏర్పాటు**

తాండూరు పట్టణానికి కాగ్నానది ఆధారంగా తాగునీటిని సరఫరా చేసే రెండు పంప్‌హౌస్‌లు గడచిన మూడేళ్లకు పైగా మూత పడ్డాయి. వినియోగంలోకి తీసుకు వస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. పట్టణంలోని 36 వార్డుల్లో 14వేల గృహాల్లో నివాసం ఉండే 71,008 జనాభాకు నిత్యం 8.5 ఎం.ఎల్.డి (మిలియన్ లీటర్స్ పర్ డే) తాగు తాగునీరు అవసరం. కానీ 6.5 ఎం.ఎల్.డి.మాత్రమే సరఫరా అవుతోంది.



**రహదారి నిర్మాణం పేరుతో పైప్‌లైన్ తొలగింపు**

కాగ్నానది వంతెన సమీపం నుంచి కొడంగల్ నియోజకవర్గం గ్రామాలు, యాలాల మండలంలోని 39 గ్రామాలకు కలిపి తాగునీటిని సరఫరా చేయడానికి 1999లో రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పంప్‌హౌస్ తాత్కాలికంగా మూత పడింది. ఏళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న పంప్‌హౌను గతేడాది వినియోగంలోకి తీసుకు వచ్చి నీటిని సరఫరా చేశారు. అయితే తాండూరు నుంచి కొడంగల్ వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల నేపథ్యంలో నీటి సరఫరా పైపులైన్‌ను తొలగించారు. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పనులను పూర్తి చేసి కొత్తగా పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే పంప్‌హౌస్ వినియోగంలోకి వస్తుంది. ప్రజలకు తాగునీటి సరఫరా జరిగి ఎద్దడి సమస్య ఉండదు. ఇందుకోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

**సుదీర్ఘ కాలంగా సేవలు**

1953లో పాత తాండూరు కాగ్నానది వారగా అప్పటి ప్రజల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ నుంచి నాలుగేళ్ల కిందటి వరకు సరిపోను నీటి సరఫరా జరిగింది. నిర్వహణ సవ్యంగా లేక పోవడంతో మరమ్మతుకు వచ్చింది. పట్టణానికి 24 గంటల పాటు నీటిని సరఫరా చేసే పంప్ ఆధారిత ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఉన్నాయి. యాలాల మండలం బెన్నూరు శివారు కాగ్నానది వారగా తాండూరు పట్టణానికి నీటిని సరఫరా చేసే మరో పంప్ హౌస్‌ను 2005లో రూ.5.80 కోట్లతో నిర్మించారు. నిర్వహణ సవ్యంగా లేక నిరుపయోగమైంది. ప్రస్తుత వేసవిలో ఈ రెండు పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే 2ఎం.ఎల్.డి. నీటి సరఫరా జరిగి ప్రజల దాహార్తి తీరుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# అన్నింటికీ ఉపకారవేతనాలే..!

తాండూరు: తాండూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు రాక పోవడంతో విద్యార్థుల ఉపకార వేతనాల నుంచే వ్యయం చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒక్కో నర్సింగ్ విద్యార్థికి రూ.5,000 ఉపకార వేతనాన్ని నేరుగా ఖాతాలో జమచేస్తోంది. ఈ డబ్బుల్లోంచి విద్యార్థులు ప్రతి నెల రూ.3,000 చొప్పున కళాశాల నిర్వహణ చూస్తున్న సిబ్బందికి చెల్లిస్తున్నారు. వీటితోనే భోజనం, వసతి గృహ నిర్వహణ తదితర ఖర్చులకు వెచ్చిస్తున్నారు. ఈ విషయమైన స్థానికంగా తీవ్ర విమర్శలు నెలకొన్నాయి.

**గతేడాదినుంచే ఆరంభం**

2023-24 విద్యా సంవత్సరం నుంచి తాండూరులో ప్రభుత్వం నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసింది. మొదటి బ్యాచ్‌లో 60 మంది విద్యార్థులకు గాను 50 మంది ప్రవేశం పొందారు. వీరిలో 45 మంది కళాశాల వసతి గృహంలోనే ఉంటున్నారు. వీరినుంచి డబ్బు స్వీకరిస్తున్నారు. యూనిఫామ్, పుస్తకాల కోసం రూ.20వేల వసూలు మొదటి సంవత్సరం ఒక్కో విద్యార్థి నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ డబ్బుల్లోంచి నాలుగేళ్ల వరకు సరిపడా పుస్తకాలు, యూనిఫామ్స్, బూట్లు, క్యాప్స్ కొనుగోలుకు వ్యయం చేస్తున్నారు. వీటిలోంచే ఓ నెలకు సంబంధించిన మెస్ బిల్లును



చెల్లిస్తున్నారు. నర్సింగ్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడమే ఇందుకు కారణమని విమర్శలొస్తున్నాయి.

**డబ్బులు తీసుకుంటున్నది వాస్తవమే..**

నర్సింగ్ కళాశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో గత్యంతరం లేక వారికొచ్చే ఉపకార వేతనాల నుంచి వసూలు చేస్తున్నాం. విద్యార్థులకు నిత్యం భోజనాలు, ఇతర ప్రాథమిక సౌకర్యాలకు ఉపకార వేతన సొమ్మునుంచే చెల్లిస్తున్నాం. తాండూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు వసతి గృహాలు, తరగతి గదులు వేర్వేరుగా ఉండేలా రూ.25 కోట్లతో రెండు భవనాలను నిర్మిస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే విద్యార్థులకు అన్ని రకాల వసతులను ప్రభుత్వమే కల్పిస్తుంది. విజయా రాణి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, తాండూరు.

# వినియోగం పెరిగినా.. తలెత్తదు అవాంతరం

తాండూరు : చలికాలం ఇంకా పూర్తికాకముందే జిల్లాలో వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వాడకమూ ఎక్కువవుతోంది. డిమాండ్‌ను ఎక్కడా తగ్గించకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఈ నేపథ్యంలోకథనం.

అటవీ ప్రాంతాల్లోనూ వేడి వాతావరణం

జిల్లా వ్యాప్తంగా 34 నుంచి 36 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు వేడి వాతావరణం నెల కొంటోంది. రాత్రి వేళ ఉక్కపోతలు మొదలయ్యాయి. అడవులు ఎక్కువగా ఉన్న అనంతగిరి, దామగుండం, ధారూర్, అనంతగిరి, జిన్‌గుర్తి, మైల్వార్, నాగుల పల్లి, రాస్నం, జుంటుపల్లి వంటి తదితర గ్రామాల్లోనూ వేడి వాతావరణం ఏర్పడటం గమనార్హం. జిల్లాలోని గృహాల్లో గాలి పంకాలు, ఏసీలు, కూలర్లు వంటి వాటికి విద్యుత్తు వాడకం ఎక్కువైంది. ఇంట్లో ఆహార పదార్థాలు పాడవకుండా ఉండేందుకు రిఫ్రిజిరేటర్లను వినియోగిస్తున్నారు. మిక్సీలను వాడుతున్నారు. ఇక యాసంగి పంటల సాగుకు నీటిని తోడేందుకు విద్యుత్తును వినియోగిస్తున్నారు. మార్చి నుంచి మే వరకు ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆమేరకు సరఫరాలో అంతరాయం లేకుండా ఇప్పటి నుంచే సమాయత్తమయ్యారు.

సమస్యల నివారణకు ఏంచేస్తున్నారంటే..

నియంత్రికలకు మరమ్మతులు.

పాడైన ఏబీ స్విచ్‌లను తొలగించి కొత్తవాటి ఏర్పాటు.

వదులుగా ఉన్న తీగలను సరిచేయడం.

తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేయడం.

ఉపకేంద్రాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

అత్యవసరమైతే తప్ప లైన్ క్లియరెన్స్ (ఎల్.సి) స్వీకరణ.

ఇదీ వాడకం తీరు

సాధారణ రోజుల్లో.. 6.89 మిలియన్ యూనిట్లు (ఎంయూ).

ప్రస్తుతం పెరిగిన వినియోగం.. 7.2 ఎం.యూ నుంచి 7.3 ఎం.యూ.

డిమాండ్ దృష్ట్యా మరింత అప్రమత్తం

జిల్లాలో అవాంతరాలు లేకుండా విద్యుత్తును సరఫరా చేస్తున్నాం. మార్చి నుంచి మే వరకు డిమాండ్ మరింత పెరుగుతుంది. ఆమేరకు ఇప్పటినుంచే మరింత అప్రమత్తంగా ఉంటున్నాం. అత్యవసర సమయంలో తప్ప అధికారికంగా సరఫరాలో ఎక్కడా కోతలు విధించడంలేదు. లీలావతి, విద్యుత్తు ఎస్.ఈ ఆపరేషన్, వికారాబాద్

# అధికారి తనిఖీ.. పనుల్లో చురుకు!

ఖమ్మం : ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటే పనులు వేగంగా జరుగుతాయనడానికి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం ఒక ఉదాహరణ. ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్టేడియాన్ని పరిశీలించారు. సమస్యల మూలాలను గ్రహించి ఏం చేయాలో ఆదేశించారు. వారం గడవక ముందే ఇప్పుడు స్టేడియంలో పునరుద్ధరణ పనులు ఊపందుకున్నాయి. అథ్లెటిక్స్ అకాడమీలోని క్రీడాకారుల వసతి, ఇతర సదుపాయాలను తీర్చిదిద్దే పనులు చేస్తున్నారు. దశాబ్దాలుగా అరకొర వసతులతో కొట్టుమిట్టాడుతున్న క్రీడాకారులకు ఇప్పుడు తగిన సదుపాయాలు సమకూరనున్నాయి. మంచాలు, పరుపులు, బీరువాలు, వారికి అవసరమైన దుస్తులు, పరికరాలు సమకూరుతున్నాయి. స్విమ్మింగ్ పూల్‌ను సుందరంగా తీర్చిదిద్దే పనులతో పాటు నీటిని శుద్ధి చేసే యంత్రాలు సైతం మార్చే పనిలో ఉన్నారు. స్విమ్మింగ్ పూల్ ప్రాంగణాన్ని ఉద్యానవనంలా మార్చాలని కలెక్టర్ ఆదేశించిన క్రమంలో ఇప్పటికే కార్పొరేషన్, ఉద్యానవన విభాగాల ఉద్యోగులు పరిశీలించారు. అందుకు తగిన అంచనాలు సిద్ధం చేస్తున్నారు. మైదానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కలెక్టర్ పరిశీలన తర్వాత స్విమ్మింగ్ పూల్, అథ్లెటిక్స్ అకాడమీల స్వరూపం మారుతోంది. ఉన్నతాధికారులు వచ్చామా? వెళ్లామా? అని కాకుండా కాసింత సమయం కేటాయించి దృష్టి సారిస్తే ఎలాంటి మార్పులు సాధ్యమో స్టేడియంలో జరుగుతున్న పనులే చక్కటి ఉదాహరణ.

# ఉత్పత్తి వద్దే చెత్త విచ్ఛిత్తి



కరీంనగర్ : తడి, పొడి చెత్తను వేరు చేసి ఎక్కడికక్కడే చెత్తను తగ్గించాలనే ఉద్దేశంతో కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాచరణ తీసుకుంది. పారిశుద్ధ్య పనుల నిర్వహణలో భాగంగా డంపింగ్ యార్డులో గుట్టలుగా చెత్త పేరుకుపోతుండటం, బయోమైనింగ్ ద్వారా చెత్త ప్రాసెసింగ్ జరుగుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం లేదు. ఈ నేపథ్యంలోనే కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ చెత్త సమస్యపై దృష్టి సారించి ఉత్పత్తి దగ్గరే తగ్గించేలా కార్యాచరణ తీసుకున్నారు. 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డుకాలనీ, 31వ డివిజన్ లక్ష్మీనగర్, గాయత్రీనగర్ ఎంపిక చేశారు. చెత్త రహిత డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు.

**పది శాతమే డంపింగ్‌యార్డుకు తరలింపు**

ఇంటి నుంచి వచ్చే పొడి చెత్తను క్షేత్రస్థాయిలో 90 శాతం తగ్గించాలి. ఏమాత్రం పనికి రాని 10 శాతం వ్యర్థాలను రీసోర్స్ పార్కు కేంద్రంలోని చెత్తను తగ్గించే మిషన్‌లో వేసి కొత్తపల్లి డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. పొడి చెత్తలో అధికంగా పుస్తకాలు, ప్లాస్టిక్ కవర్లు, అట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బొమ్మలు, చెప్పులు, వస్త్రాలు, గాజు పరికరాలు, ఇనుము, ఇతర వస్తువులు ఉంటాయి. వీటిని డంపింగ్‌యార్డుకు వెళ్లకుండా రిక్షా కార్మికులు, చెత్త సేకరించే వారితో వేరు చేసి వారికి ఆదాయ మార్గాన్ని చూపిస్తారు.

**ప్రజల భాగస్వామ్యం అవసరం**

ఇంట్లోంచి వచ్చే చెత్తా చెదారం తీసుకొచ్చి శానిటేషన్ ట్రాక్టర్‌లో, స్వచ్ఛ ఆటోలో వేస్తుంటారు. పొడి చెత్తలో వచ్చే వస్తువులు నామమాత్రంగా వేరు చేస్తుండగా మిగతా చెత్తంతా డంపింగ్‌యార్డుకు వెళ్తోంది. అక్కడ దుర్వాసనతోపాటు మంటలు రావడం, పొగ వచ్చి ఆ ప్రాంతంలో కాలుష్యం కమ్ముకుంటుంది. అలా కాకుండా ఇంటి నుంచే దేనికి అదే వేరు చేస్తే సగానికి పైగా చెత్త తిరిగి వినియోగించుకోవడానికి వీలు ఉంటుందనే విషయాన్ని గుర్తించాలి. పట్టణాలు, నగరాల్లో ప్రజలు ఎవరికి వారు ఆలోచన చేస్తే చెత్త తగ్గించుకునే వీలుంది.

**అవగాహన కార్యక్రమాలు..**

డంపింగ్‌యార్డుకు చెత్తను పంపించకుండా సేకరించిన చోట వేరు చేసేలా స్వచ్ఛ ఆటో కార్మికులకు, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్తతో ఉపయోగాలు, నష్టాలను వివరించడం డంపింగ్‌యార్డు వెళ్లకుండా పొడి చెత్తను తిరిగి వినియోగించుకోవడం ప్రతి ఆటోకు ఉన్న మైకు ద్వారా ప్రచారం చేయడం

అపార్టుమెంట్లలో తడి చెత్తను ఒక చోటకు చేర్చి కంపోస్టు మిషన్ ద్వారా ఎరువు తయారు చేసేలా చూడటం, ఆ మిషన్ కొనుగోలు చేసేలా ప్రోత్సహించడం స్వచ్ఛ ఆటోల ద్వారా ప్రతి రోజు 500 ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తారు. ఎంపిక చేసిన రెండు డివిజన్లలో వారానికి రెండు రోజులు మంగళ, శుక్రవారం పొడి చెత్త, ఆది, సోమ, బుధ, గురువారం, శనివారాల్లో తడి చెత్త సేకరిస్తున్నారు.

# చి'వరి'కి అందని నీరు



జగిత్యాల : జిల్లాలోని ఆయకట్టు చివరి భూములకు కాలువ నీరు అందడం లేదు. కాకతీయ ప్రధాన కాలువ జిల్లా నుంచే వెళుతుండగా డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువలు, పిల్లకాలువల ద్వారా పంటలకు మళ్లిస్తారు. కానీ ప్రధాన కాలువతోపాటు డిస్ట్రిబ్యూటరీలు, ఇతర కాలువల లైనింగ్ చాలాచోట్ల దెబ్బతినడం, చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలంకావటం వంటి కారణాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యంగల కాకతీయ కాలువలో ప్రస్తుతం 6,500 క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో గరిష్ఠంగా 5,500 క్యూసెక్కులనే వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు చాలాచోట్ల దెబ్బతినటంతో ఏ కాలువనిండా నీటిని తరలించలేక దాదాపుగా 37 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందటం లేదు.

**చేపట్టాల్సిన చర్యలు**

యాసంగికి ఎస్సారెస్పీ నుంచి 17.50, చెరువుల ద్వారా 5.45 టీఎంసీల నీటిని ఏప్రిల్ మొదటివారం ఇవ్వనున్నారు. ఇప్పటికే 4 తడులు పూర్తికాగా మరో 3 తడులు వస్తాయి కానీ.. జిల్లాలో పెద్దఎత్తున సాగుచేసిన వరిపైరు పూర్తికానందున మరో నీటితడి కావాలి.

చివరికి నీటి ఎద్దడి ఏర్పడుతున్నందున కాలువలకు అధికంగా నీటిని విడుదల చేయాలి. కాలువలకు అమర్చిన మోటార్లను పరిమిత సమయం మేరకే నడిచేలా చూసి దిగువకు నీరు పారించాలి.

రూ.89 కోట్ల వరకు మరమ్మతులు, ఇతర పనులకు వెచ్చించినా.. సకాలంలో నిధులురాక చాలావరకు పనులను చేపట్టలేదు. వచ్చే వేసవిలోనైనా అన్ని మరమ్మతు, లైనింగ్ పనులను పూర్తిచేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. గతేడాదితో పోలిస్తే సరిగ్గా ఇదే సమయానికి అరమీటరు మేరకు భూగర్భ జలమట్టం అడుగంటింది. కాకతీయ కాలువతోపాటు వరద కాలువ నుంచి చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేసి గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే జలమట్టం పెరిగి పంపుసెట్ల ద్వారానూ నీటిని పారించవచ్చు. మిషన్ కాకతీయ ద్వారా మిగిలిన చెరువుల పునరుద్ధరణను వేసవిలో పూర్తి చేయాలి. రోళ్లవాగు ప్రాజెక్టును రూ.135 కోట్లకుపైగా నిధులతో ఆధునికీకరిస్తున్నా దీన్ని ఎస్సారెస్పీ నీటితోనే నింపాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ నిండని సందర్భాల్లో 2.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన రోళ్లవాగులోకి గోదావరి నీటిని ఎత్తిపోసేలా బీర్‌పూర్ మండలం రంగసాగర్ వద్ద ఎత్తిపోతల పథకాన్ని చేపట్టాలి. గోదావరిలోనూ నీరు లేనందున పలు ఎత్తిపోతల పథకాలు నడిపించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో గోదావరిలో అడ్డుకట్టలతో నీటిని నిలువచేసి ఎత్తిపోయాలి. జిల్లాలోని 32 గ్రామాలకు తలపెట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలి. అవసరమైన పథకాలకు మరమ్మతులు చేపట్టి ఎత్తిపోతలను పొడిగిస్తే ప్రయోజనం కలుగుతుంది. వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

# కొనసాగుతున్న విచారణలు

గోదావరిఖని : రామగుండం నగరపాలికలో అక్రమాలపై విచారణలు కొనసాగుతూనే ఉన్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుద్ధ్య వాహనాల కొనుగోలులో అక్రమాలు జరిగాయని.. అసలు ధర కంటే ఎక్కువ రేటు కోట్ చేయడం, నాసిరకం వాహనాలు కొనుగోలు చేశారని, వాహనాలు రాకుండానే బిల్లులు చెల్లించారని సుమారు రెండేళ్ల క్రితం ఆరోపణలు వచ్చాయి. డబ్బు చేతులు మారాయన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు ఎనిమిది నెలల క్రితం నగరపాలికలో సంబంధిత దస్త్రాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణ కొనసాగుతుండగానే పురపాలక నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో అంతర్గత విచారణకు ఆదేశించారు. డీజిల్ వినియోగంలోనూ అక్రమాలు నెలకొన్నాయని పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో పురపాలక నిర్వహణ ప్రాంతీయ సంచాలకులు షాహీద్ మసూద్ సోమవారం నగరపాలక కార్యాలయంలో విచారణ చేపట్టారు. డీజిల్ వినియోగ బిల్లుల దస్త్రాలను పరిశీలించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనుగోలు, బిల్లుల చెల్లింపు జరగాల్సి ఉండగా కేవలం పారిశుద్ధ్య పర్యవేక్షకులకు అప్పగించడాన్ని ఆయన తప్పుబట్టారు. సిబ్బందిలో కొందరు గతంలో సొంత వాహనాలకు డీజిల్ పోయాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చిన సంఘటనలున్నాయి. ఇటీవల ఇలాంటి ఒత్తిళ్లు మరింత పెరగడంతో డీజిల్ వినియోగం పెరిగినట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఒక్కో పారిశుద్ధ్య వాహనానికి ఎంత డీజిల్ పోయించారు? ఎన్ని కిలోమీటర్లు తిరిగాయన్న విషయాలను విచారణ అధికారులు ఆరా తీస్తున్నారు.

**గతంలోనూ..** రామగుండం నగరపాలికలో గతంలో అనేక అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.



అందులో కొందరు అధికారులు ఉద్యోగ విరమణ పొందినప్పటికీ వారికి రావాల్సిన ప్రయోజనాలను నిలిపివేశారు. కొళాయి కనెక్షన్లలో అక్రమాలు మొదలుకొని అభివృద్ధి పనులు చేపట్టకుండానే బిల్లులు చెల్లించడం వరకు అనేక ఘటనలపై విజిలెన్స్ విచారణలు చేపట్టారు. గౌతమినగర్‌లో చెత్త నిర్వహణ కేంద్రంలో రోడ్డు వేయకుండానే వేసినట్లుగా బిల్లులు చెల్లించిన సంఘటనలో పోలీసులకు ఫిర్యాదు అందడంతో చెక్కు జారీ చేసిన ఉన్నతాధికారితో పాటు ఆడిట్ అధికారిపై కేసు నమోదు కాగా విచారణ కొనసాగుతోంది. కరోనా సమయంలో పారిశుద్ధ్య విభాగంలో సున్నం, బ్లీచింగ్ పౌడర్‌తో పాటు వివిధ సామగ్రి కొనుగోళ్లలో అక్రమాలు నెలకొన్నాయనే ఆరోపణలున్నాయి. ఓ చోట చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఉన్నతాధికారుల అనుమతి లేకుండా మరో చోట చేపట్టిన సంఘటనల్లోనూ విచారణ చేపట్టారు. ఇలా రామగుండం కార్పొరేషన్‌లో అక్రమాల ఆరోపణలపై విచారణ కొనసాగుతూనే ఉంది.

# తాగునీటి ఇబ్బందులు షురూ!

వైరా : వేసవి ఆరంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. 'మిషన్ భగీరథ' నీళ్లు పూర్తిస్థాయిలో అందకపోవటంతో అక్కడక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బావులు, బోర్ల నుంచి తాగునీరందించే క్రమంలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించేందుకు నిధుల కొరత వేధిస్తోంది. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవటంతో కేంద్రం నుంచి నిధులు అందటం లేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులూ రావటం లేదు. 'జనరల్ ఫండ్'ను వినియోగించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా అవీ అక్కరకు రావటం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చింతకాని మండలం వందనం గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీలకు మిషన్ భగీరథ జలాలు సక్రమంగా అందటం లేదు. స్థానిక బోర్లు, బావుల నీళ్లు సరిపోకపోవటంతో ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే మండలంలోని బొప్పారం గ్రామపంచాయతీకి ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరందటం లేదు. పంచాయతీలో నిధులు లేకున్నా అధికారులు సొంతంగా ఖర్చుపెట్టి తాగునీటి పంపిణీకి చర్యలు చేపట్టారు. రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో మోటార్లు కాలిపోవటంతో పంచాయతీ అధికారులు సొంతంగా రూ.వేలు వెచ్చించి మరమ్మతులు చేయించారు. అయినా తరచూ ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతోంది. తాజాగా పైపులైన్ పగిలిపోవటంతో అప్పోసొప్పో చేసి బాగు చేయించి నీరందిస్తున్నారు.

వైరా మండలంలో సుమారు 370 చేతిపంపులు ఉన్నాయి. వీటిలో దాదాపు 100 పనిచేయటం లేదు. చాలాచోట్ల ప్రత్యామ్నాయ వనరులు బలంగా లేవని, మోటార్లు, లైన్లకు మరమ్మతులు చేపట్టాలని, నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

వేధిస్తున్న నిధుల కొరత

ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నప్పటికీ వారికి నిధులు, అధికారాలు లేకపోవటంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎక్కడెక్కడ బోర్లను అద్దెకు తీసుకోవాలి.. ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయాలనే అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వేసవి ముందస్తు ప్రణాళికపై కసరత్తు జరిగినా నిధులు సమకూర్చితేనే అంతిమంగా ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సకాలంలో స్పందించకపోతే..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నచోట్ల తాగునీటి కష్టాలు తప్పటం లేదు. అశ్వాపురం మండలం రథంగుట్ట, పాల్వంచ సమీపంలోని తోగ్గూడెం నుంచి 1,500 గ్రామాలకు రోజుకు 15కోట్ల లీటర్ల తాగునీరు సరఫరా అవుతోంది. అయితే చాలా గ్రామాలకు సామర్థ్యం మేరకు మిషన్ భగీరథ పైపులైన్లు వేయలేదు. కొన్నిచోట్ల లైన్లు వేసినప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, టేకులపల్లి, బూర్గంపాడు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని కొన్నిగ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. భద్రాచలం వంటి చోట్ల కొన్నేళ్ల క్రితం ఏర్పాటుచేసిన సురక్షిత మంచినీటి పథకాలను నిర్వహిస్తున్నా లీకేజీలు, మోటార్లు కాలిపోవడం, లైన్లు పగిలినప్పుడు సత్వరం పునరుద్ధరించకపోవటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఖమ్మం జిల్లాలోని 579 గ్రామ పంచాయతీలున్నాయి. నిధుల కొరతతో ప్రత్యేకాధికారులు నామమాత్రంగా తయారయ్యారు. చాలాచోట్ల తాగునీటి వనరుల కోసం రూ.వేలల్లో అప్పు చేయాల్సి వచ్చిందని పలువురు అధికారులు వాపోతున్నారు. సుమారు 300 గ్రామపంచాయతీలకు అవసరం మేరకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. పంచాయతీ కార్యదర్శులపై భారం పడుతున్నా తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

రాంబాబు, డీఎల్‌పీఓ, ఖమ్మం

# పేరులోనే ఉంది అంతా

మంచిర్యాల : ధ్రువపత్రాల కోసం దరఖాస్తుల సమయంలో చాలా మంది తప్పులు చేస్తున్నారు. పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీని రాయడంలో చేస్తున్న పొరపాట్లు పెరుగుతున్నాయి. చాలా మంది తడబాటుకు గురవుతున్నారు. ధ్రువపత్రం వచ్చాక దోషాన్ని గుర్తించి ఆందోళన చెందుతున్నారు. పేర్లు, ఇతర వివరాలు సరిచూసుకోకుండా దరఖాస్తు చేస్తుండటంతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. తమ పిల్లల విషయంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీ కార్యక్రమం ద్వారా విద్యార్థుల పురోగతిని పరిశీలించవచ్చన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అపార్(ఆటోమేటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను ప్రవేశపెట్టింది. ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్లాలన్నా, ప్రవేశ పరీక్షలు రాయాలన్నా అపార్ నంబరు వినియోగించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన నమోదు ప్రక్రియ సాంకేతిక కారణాలతో ముందుకు సాగడం లేదు. పాఠశాల రికార్డులో ఉన్న విద్యార్థుల వివరాలు, ఆధార్ నంబరును అపార్‌లో నమోదు చేయాలి. పాఠశాల రికార్డుల్లో ఉన్న పేరు, ఆధార్‌లో ఉన్న పేరు ఒకే రకంగా ఉండాలి. తేడా ఉంటే నమోదు కావడం లేదు.

ప్రస్తుతం చాలా మంది విద్యార్థులకు సంబంధించి పాఠశాల రికార్డుల్లో పేర్లు, ఆధార్ కార్డుల్లో పేర్లతో అక్షరదోషాలుగా ఉండడంతో వివరాల మార్పులకు తమ పిల్లల్ని వెంటేసుకొని ఆయా కార్యాలయాలు తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఆధార్‌కార్డుల్లో పేరు, అక్షర దోషాల సవరణకు తగిన ధ్రువపత్రాలు సమర్పించాలి. పుట్టిన తేదీకి మార్పులకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. చిన్నారులు పుట్టినప్పుడే పుట్టిన తేదీని నమోదు చేసుకోవాలి. బిడ్డ ఆసుపత్రిలో జన్మిస్తే సదరు ఆసుపత్రి వారు తల్లిదండ్రుల వివరాలు అడుగుతారు. మనం చెప్పిన వివరాలు సరిగ్గా నమోదు చేశారో లేదో ఒకటి రెండు సార్లు ఆరా తీయాలి. చిన్నారుల నామకరణం రోజు పెట్టే పేరును తల్లిదండ్రులు ముందుగానే నిర్ణయించుకుంటే మంచిది. జనన ధ్రువీకరణ పత్రం మీసేవలో దరఖాస్తు చేసుకుంటే ఆసుపత్రిలో మనం ఇచ్చిన వివరాలే సంబంధిత అధికారులు ఆమోదించి ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. చాలా మంది ఆసుపత్రుల్లో వివరాలు నమోదు తప్పుగా చేయించడంతో మరోసారి ఆసుపత్రుల ద్వారా సవరణకు దరఖాస్తు చేస్తున్నారు. పాఠశాల ప్రవేశాల్లో తమ చిన్నారులను బడికి పంపేందుకు ప్రవేశాల సమయంలో ఆధార్‌కార్డు, ఇంటిపేరు, తల్లిదండ్రుల పేర్లు పుట్టిన తేదీ వివరాలు కచ్చితంగా సరిచూసుకోవాలి. మనం ఇచ్చిన వివరాలు, పాఠశాల సిబ్బంది నమోదు చేసుకున్న వివరాలు ఒకేలా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలి. పొరపాట్లు ఉంటే స్పందించి వెంటనే మార్పించుకోవాలి. ఆధార్... ప్రతి వ్యక్తికి ప్రస్తుతం ఆధార్ తప్పనిసరిగా మారింది. చిన్నారి ఆధార్ నమోదుకు వెళ్లినపుడు మనం ఇచ్చిన దరఖాస్తులో పొందుపర్చిన వివరాలు సరిగ్గానే ఉన్నా ఆధార్ కేంద్రం నిర్వాహకుడు వివరాలు నమోదులో తప్పులు చేసే అవకాశం ఉంది.




చెన్నై: ఇప్పుడు ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్ అంతా భారతీయులదేనని చెప్పారు. మద్రాస్ ఐఐటీలో నిర్వహించిన 'ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ 2025' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "మద్రాస్ ఐఐటీ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉంది. ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోంది. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ అగ్నికుల్ మంచి విజయాలు అందుకుంది. ఇక్కడి స్టార్టప్‌లు 80 శాతం విజయవంతమవుతున్నాయి. ఈ ఐఐటీలో సుమారు 35-40 శాతం తెలుగు విద్యార్థులే ఉన్నారు. ఐఐటీల స్థాపన దేశ విద్యారంగంలో గొప్ప ముందడుగు. ఆర్థిక సంస్కరణలు దేశ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. 1991లో తీసుకొచ్చిన సంస్కరణలు ఎంపిక కాదు.. తప్పనిసరి. రాజకీయ సంస్కరణలతో సోవియట్ రష్యా అనేక దేశాలుగా విడిపోయింది. అదే సమయంలో చైనా ఆర్థిక సంస్కరణలు ప్రారంభించింది. ఆ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆ దేశం ఎదిగింది. భారత్ కూడా సంస్కరణల తర్వాత అభివృద్ధి బాట పట్టింది. బ్రిటిష్‌వారు మన దేశం నుంచి అంతా తీసుకెళ్లారు.. ఒక్క ఇంగ్లీష్‌ను మనకు వదిలేశారు. 1990లలో కమ్యూనికేషన్ రంగంలో బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ గుత్తాధిపత్యం ఉండేది. ఆర్థిక సంస్కరణల తర్వాత కమ్యూనికేషన్ల రంగంలో ప్రైవేటు సంస్థల రాక ఓ గేమ్ ఛేంజర్. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను మొదట కలుస్తానని అడిగినప్పుడు రాజకీయ నేతలతో సంబంధం లేదని చెప్పారు. ఆయన్ను ఒప్పించి అపాయింట్‌మెంట్ తీసుకున్నా. 45 నిమిషాలు మాట్లాడారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థ నెలకొల్పాలని కోరాను. ఇప్పుడు అదే సంస్థకు సీఈవోగా తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల ఉన్నారు. కొంతకాలంగా భారత్ వృద్ధిరేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటోంది. 2014లో మనది పదో ఆర్థిక వ్యవస్థ.. ఇప్పుడు ఐదో స్థానానికి చేరింది. భారత్‌కు ఉన్న గొప్పవరం జనాభా.. డెమోగ్రాఫిక్ డివిడెండ్. మనమంతా కృషి చేస్తే త్వరలోనే ప్రపంచంలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుంది. చాలా దేశాలు జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్నాయి. మన దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు" అని చంద్రబాబు అన్నారు.

**విద్యార్థుల నుంచి విశేష స్పందన...** మరోవైపు సీఎం చంద్రబాబుకు మద్రాస్ ఐఐటీ విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ఆయన ప్రస్తావన వచ్చినప్పుడల్లా కేరింతలు, చప్పట్లతో ప్రాంగణం మార్మోగింది.




బ్యాంకాక్: మయన్మార్‌ను శుక్రవారం వరుస భూకంపాలు వణికించాయి. 12 నిమిషాల వ్యవధిలో రెండు సార్లు భారీ భూకంపాలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 7.7గా నమోదైంది. ఈ భూకంపం కారణంగా పొరుగున ఉన్న థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో రెండుసార్లు తీవ్ర ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రకంపనల కారణంగా పలు భవనాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బ్యాంకాక్‌లో ప్రకంపనల తీవ్రత 6.4, 7.3గా నమోదైంది. అటు భారత్ సహా ఆగ్నేయాసియా దేశాల్లోనూ ఈ ప్రభావం కన్పించింది. సెంట్రల్ మయన్మార్‌లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బ్యాంకాక్‌లో ప్రకంపనలు సంభవించాయి. పలు భవనాల్లో అలారమ్ మోగడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు.

**శిథిలాల కింద 43 మంది..?...** ప్రకంపనల ధాటికి అనేక భవనాలు ఊగిపోయాయి. పలు భవంతులు నేలమట్టమయ్యాయి. ఓ భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కిందకు పడిపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం పేకమేడలా కూలిన దృశ్యాలు బయటికొచ్చాయి. ప్రమాదం సమయంలో ఆ భవనంలో ఎవరైనా కార్మికులు ఉన్నారా? శిథిలాల కింద చిక్కుకుపోయారా? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు. అయితే, 43 మంది కార్మికులు చిక్కుకున్నట్లు పలు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో థాయ్‌లాండ్‌లో ప్రధాని షినవత్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. మరోవైపు, మయన్మార్‌లోనూ అనేక భవనాలు ధ్వంసమైనట్లు తెలిసింది. పలు రహదారులపై చీలికలు ఏర్పడ్డాయి. అయితే.. భూకంపం కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.

**భారత్‌లోనూ ప్రకంపనలు..** ఈ భూకంప ప్రభావం ఆగ్నేయాసియా దేశాలపైనా కన్పించింది. భారత్‌లోని కోల్‌కతా, ఇంఫాల్, మేఘాలయలో స్వల్పంగా ప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. మేఘాలయ ఈస్ట్‌గారో హిల్స్‌లో 4 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోనూ 7.3 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది.


## సీఎం చంద్రబాబును అభినందించిన ఎంపీలు..




న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో అరకు కాఫీ ప్రారంభం సందర్భంగా పలువురు ఎంపీలు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అభినందించారు. ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ అప్పలనాయుడు మాట్లాడుతూ... చాలా మంది ఎంపీలు తమ ప్రాంతంలో అరకు కాఫీని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. ఏపీ రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు తపన పడుతున్నారని, ప్రజలు ఆయనపై విశ్వాసం, నమ్మకం పెట్టుకున్నారని, దేశంలో చంద్రబాబు నాయుడు ఒక సీనియర్ నాయకుడని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకి 11 సీట్లుకే పరిమితం చేసి.. గుణపాఠం చెప్పినా ఆ పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి ఆలోచన ధోరణి ఇంకా మారలేదని ఎంపీ అప్పలనాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు.

అరకు కాఫీ కి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్ సభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సోమవారం ఉదయం (24వ తేదీ) అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు అయ్యాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటుకు లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరోరా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఎంపీలు అల్పాహారం తీసుకునే సంగం కాంటీన్‌లో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేసింది. లోకసభ కాంటీన్‌లో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అరకు స్టాల్ ప్రారంభించారు. రాజ్యసభ కాంటీన్‌లో వాణిజ్య వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జోయల్ ఓరం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ, బీజేపీ ఎంపీలు హాజరయ్యారు. తూర్పు కనుమల నుండి భారత దేశ పార్లమెంట్ వరకు అరకు వ్యాలీ కాఫీ ప్రస్థానం దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని, ఏపీ రాష్ట్ర గిరిజనుల కష్టాన్ని ప్రపంచం గుర్తించబోతోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గిరిజనుల స్వహస్తాలతో పండించిన కాఫీ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి నిలయమైన భారత పార్లమెంట్‌లో ఎంపీలు అందరినీ అమోఘమైన రుచితో మైమరపిస్తోందన్నారు.

## మయన్మార్, బ్యాంకాక్‌లో భారీ భూకంపం.. ప్రధాని మోదీ ఆరా



దిల్లీ: మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలను శుక్రవారం వరుస భూకంపాలు వణికించాయి. ప్రకంపనల ధాటికి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ విపత్తుపై భారత ప్రధాని నరేంద్రమోదీ విచారం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయా దేశాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. "మయన్మార్, థాయ్‌లాండ్‌లో భూకంప పరిస్థితులపై ఆందోళనగా ఉంది. అక్కడి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నా. వారికి అవసరమైన సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. సహాయక చర్యలపై ఆయా దేశాల ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని కేంద్ర విదేశాంగ శాఖను కోరా" అని మోదీ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.

## వంశీకి రిమాండ్‌పై కోర్టు నిర్ణయం ఇదీ




విజయవాడ, మార్చి 28: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ రిమాండ్‌ను సీఐడీ కోర్టు పొడిగించింది. ఏప్రిల్ 9 వరకు వంశీ రిమాండ్‌లో ఉండనున్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ ఏ71 గా ఉన్నారు. అంతేకాకుండా సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో రిమాండ్ ఖైదీగా విజయవాడ జిల్లా జైలులో ఉన్నారు వంశీ. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నేటితో రిమాండ్ ముగియడంతో వంశీని ఈ రోజు (శుక్రవారం) ఉదయం జిల్లా జైలు నుంచి కోర్టుకు తీసుకొచ్చారు గన్నవరం పోలీసులు. వంశీతో పాటు నిమ్మ లక్ష్మీపతిని కూడా పోలీసులు ప్రత్యక్షంగా కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో వంశీకి ఏప్రిల్ 9 వరకు సీఐడీ కోర్టు రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిన్న (గురువారం) వంశీ బెయిల్ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుతో తనకు సంబంధం లేదని బెయిల్ మంజూరు చేయాలంటూ వంశీ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయాధికారి.. ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవించి పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. దీంతో బెయిల్ వస్తుందని అనుకున్న వంశీకి మరోసారి నిరాశే ఎదురైంది. వంశీతో పాటు మరో నలుగురు నిందితులకు కూడా బెయిల్ ఇవ్వలేమని కోర్టు తేల్చిచెప్పింది. తమకు బెయిల్ ఇవ్వాలని శివకుమార్, ఆదిలక్ష్మీ, ప్రవీణ్, రూతమ్మ పిటషన్ వేయగా.. దాన్ని కోర్టు కొట్టివేసింది. అంతేకాకుండా సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుకు సంబంధించి విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో ఇప్పటికే వాదనలు ముగిశాయి. వంశీ బెయిల్ పిటిషన్‌పై ఈరోజు సాయంత్రానికి తీర్పు వెలువడే అవకాశం ఉంది. ఈ కోర్టులో కూడా వంశీకి బెయిల్ మంజూరు అవుతుందా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. నేటి సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

## ఉద్యోగులకు డీఏ పెంపు, ఎలక్ట్రానిక్స్ తయారీకి పీఎల్ఐ.. కేంద్ర కేబినెట్ నిర్ణయాలివే



దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. డియర్‌నెస్ అలవెన్సును 2 శాతం మేర పెంచుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వని వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. జనవరి 1 నుంచి పెరిగిన డీఏ వర్తిస్తుందని తెలిపారు. డీఏ సవరణ తర్వాత డీఏ మొత్తం బేసిక్ శాలరీలో 53 శాతం నుంచి 55 శాతానికి పెరగనుంది. దీంతో ఆ మేర ఉద్యోగుల వేతనం పెరగనుంది. డీఏ పెంపుతో 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది. చివరగా గతేడాది జులైలో డీఏను 50 శాతం నుంచి 53 శాతానికి పెంచారు. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను కేంద్రం సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ అందజేస్తారు. నాన్ - సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీని కేంద్రం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం కిందకు తీసుకొచ్చింది. ఇందుకోసం ఆరేళ్లకు గాను రూ.22,919 కోట్లు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల సుమారు రూ.59,350 కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. దీంతో పాటు ప్రత్యక్షంగా 91 వేల మందికి, పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి (ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) పొటాష్, పాస్ఫేట్ ఫెర్టిలైజర్లకు రూ.37,216 కోట్లు సబ్సిడీ కింద చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.




## వైసీపీ ఓవర్ యాక్షన్ మామూలుగా లేదుగా.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండి నీతి కబుర్లా

ప్రజల మద్దతు తమకు లేదని తెలిసినా వైసీపీ ఓవర్ యాక్షన్ చేస్తుందా.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీకి భయపడిన ఆ పార్టీ తమకు బలముండి గెలిచిన ఎంపీపీ, వైస్ ఎంపీపీల గురించి ఎక్కువగా ప్రచారం చేసుకోవడం ఆ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనమా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాష్ట్రంలో వివిధ కారణాల రీత్యా ఒక జిల్లా పరిషత్తు ఛైర్మన్, 24 ఎంపీపీ, 17 వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి స్థానిక సంస్థల్లో పార్టీ బలాబలాల ఆధారంగా ఎంపీటీసీలు ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నుకుంటారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలను నేరుగా ప్రజలు ఓటు వేసి ఎన్నుకోరు. ప్రజల ద్వారా ఎన్నికైన ఎంపీటీసీలు మాత్రమే వీరిని ఎన్నుకుంటారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోకుండా పోటీ చేసే అభ్యర్థులపై దాడులకు పాల్పడుతుండటం, కిడ్నాప్‌లు చేస్తున్నారనే ఆరోపణలతో కార్యకర్తలను కాపాడుకోవడమే ప్రధాన ఉద్దేశంగా చాలా చోట్ల టీడీపీ అభ్యర్థులు పోటీ చేయలేదు. దీంతో వైసీపీకి చెందిన అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించారు. ఇంకా ఏడాదికి పైగా సమయం ఉండటంతో అప్పట్లో ఎన్నికైన ఎంపీటీసీలే ప్రస్తుతం ఉన్నారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధుల బలం ఆధారంగా వైసీపీ అన్ని స్థానాలను గెలుచుకోవల్సి ఉంటుంది. కానీ కొన్ని పదవులను కోల్పోవలసి వచ్చిది. కారణం ఆ పార్టీ నాయకులకు వైసీపీపై నమ్మకం లేకపోవడమే కారణం. వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలవాల్సిన తాము ఎందుకు ఓడిపోయామనే ఆత్మపరిశీలన చేసుకోకుండా తాము ఏదో సాధించామనే రీతిలో వైసీపీ నాయకులు ప్రచారం చేసుకోవడంపై ఆ పార్టీ ఓవర్ యాక్షన్ మామూలుగా లేదుగా అనే చర్చ సాగుతోంది.

**ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా...** ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపోటములే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. మరో ఏడాదిలో ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో ఏ పార్టీ ప్రజల విశ్వాసాన్ని పొందుతుందే తేలిపోతుంది. అప్పటివరకు ఆగకుండా తమకు సంఖ్యాబలం సంపూర్ణంగా ఉన్న స్థానాల్లో గెలిచి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందనే చర్చ జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ స్థానానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. లక్షలాదిమంది యువత, చదువుకున్న వారు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడిపోతే పరువు పోతుందనే ఆలోచనతోనే వైసీపీ పోటీకి దూరంగా ఉందనే ఆరోపణలు వినిపించాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతు పలికింది. వైసీపీ మద్దతు తెలిపిన పీడీపీ అభ్యర్థులు మూడు స్థానాల్లో ఓడిపోయారు. వైసీపీ కారణంగానే పీడీఎఫ్ అభ్యర్థులు ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చిందనే ప్రచారం జరిగింది. వాస్తవాలు ఓ రకంగా ఉంటే వైసీపీ మాత్రం మరొక రకంగా ప్రచారం చేస్తోంది.

## 11 ఏళ్ల టెక్ పిడుగు అఖిల్‌ను అభినందించిన మంత్రి లోకేశ్



ఉండవల్లి: యూకేలో విద్యను అభ్యసిస్తున్న అఖిల్.. చిన్న వయసు నుంచే టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. మైక్రోసాఫ్ట్ ధ్రువీకరించిన అజ్యూర్, డేటా సెక్యూరిటీతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫౌండేషన్ కోర్సుల్లో సర్టిఫికెట్లు పొందాడు. యూకే నిర్వహించిన పలు టెక్ సమిట్‌లలో పాల్గొన్నాడు. అమరావతిలో జరగనున్న సమాచార, సాంకేతికాభివృద్ధిలో భాగస్వామి అయ్యేందుకు అఖిల్ ఆసక్తి చూపించడంతో గతంలో మంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అఖిల్‌ను కలిశారు. టెక్నాలజీలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ఆ చిన్నారిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

# డిజైనర్ లుక్కులో పిచ్చెక్కించిన మలైకా

బికినీలు స్విమ్ సూట్లు జిమ్ వేర్.. దుస్తులు ఏవైనా అందులో వేడెక్కించడం మలైకా ప్రత్యేకత. చీరకట్టులోను చిల్లింగ్ అందాలతో మతులు చెడగొడుతుంది. ఇప్పుడు అందమైన వైట్ అండ్ గోల్డ్ లెహంగాలో మలైకా ఫోజులు కుర్రకారు గుండెల్లో గుబులు పెంచుతున్నాయి. ఇది సురిలీ గోయెల్ లెహెంగా... మలైకా ఫోటోషూట్ బ్యాక్ గ్రౌండ్ పెయింటింగు ప్రత్యేకంగా హైలైట్ అయింది. 51 ఏళ్ల మలైకా కు సెలబ్రిటీ స్టైలిస్ట్ ఆస్తా శర్మ ఈ లుక్‌ను స్టైలింగ్ చేసారు. ఈ ఖరీదైన డిజైనర్ లెహంగా తొమ్మిది అడుగుల పొడవుతో



ఆకర్షణీయంగా కనిపిస్తోంది. చురిదార్ స్లీవ్స్ ఐవరీ బ్లౌజ్‌తో బంగారు రంగు పూల ఎంబ్రాయిడరీ డిజైన్ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా మలైకా అందాలను ప్లంగింగ్ V-నెక్‌లైన్ అద్భుతంగా ఎలివేట్ చేసింది. ఇది అభిమానులకు ప్రత్యేకమైన కనువిందు. మలైకా తన లుక్ కు ఎత్నిక్ గోల్డ్ చోకర్ నెక్లెస్, స్టేట్మెంట్ రౌండ్ చెవిపోగులు, తెల్లటి ముత్యాల పూసలను జోడించింది. మత్తు చల్లే కనుల అందాలతో మలైకా మైమరిపించింది. మలైకా అరోరా ఎత్నిక్ చిక్ అవతార్ ప్రస్తుతం ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. ఏజ్ లెస్ బ్యూటీగా చెలమాణి అవుతున్న మలైకా అర్జున్ కపూర్ నుంచి విడిపోయాక పూర్తిగా ఒంటరి. ప్రస్తుతం కెరీర్ పై మాత్రమే దృష్టి సారించింది. రియాలిటీ షోలు ఫ్యాషన్ షోలతో భారీగా ఆర్జిస్తోంది. సోషల్ మీడియా ప్రకటనలు, పోస్టింగులతోను లక్షల్లో ఆదాయం ఆర్జిస్తోంది.

## నేషనల్ క్రష్ ఆస్తి ఎన్నికోట్లు అంటే?

నేషనల్ క్రష్ రష్మికా మందన్నా రేంజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు పట్టిందల్లా బంగారమే అవుతుంది. యానిమల్ , పుష్ప-2, ఛావా ఇలా వరుస సినిమాలతో పాన్ ఇండియాలోనే సంచలనంగా మారిన బ్యూటీ. బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో అమ్మడి రేంజ్ అంతకంతకు రెట్టింపు అవుతుంది. నటిగా అన్ని భాషల్లోనూ అవకాశాలు వస్తున్నాయి. కోట్ల రూపాయలు పారితోషికం తీసుకుంటుంది. రెండేళ్ల తర్వాత చేసే సినిమాకు ఇప్పటి నుంచి అడ్వాన్సులు ఇవ్వడానికి నిర్మాతలు క్యూలో ఉన్నారు. సొగసరి తో



లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు తీయడానికి సిద్దంగా ఉన్నారు. ప్రస్తుతం రష్మిక మాత్రం బాలీవుడ్ కెరీర్ పైనే దృష్టి పెట్టి సినిమాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా రష్మిక ఆస్తుల చిట్టా బయటకు వచ్చింది. ప్రఖ్యాత ఫోర్బ్స్ నివేదిక బయటపెట్టింది. అమ్మడి వయసు 28. కానీ ఆస్తి మాత్రం 66 కోట్ల వరకూ సంపాదించింది. ఒక్కో సినిమాకు 4 నుంచి 8 కోట్ల మధ్యలో పారితోషికం రూపంలో అందుకుం టుంది. అతి త్వరలోనే ఆమె ఆస్తి విలువ 100 కోట్లకు చేరుతుందని ఫోర్బ్స్ అంచనా వేస్తోంది. హీరోయిన్ గా నటిస్తూనే రష్మిక బ్రాండ్ అంబాసిడర్ గాను కొనసాగుతుంది. వాణిజ్య ప్రకటనల్లో నటించే అవకాశం వచ్చిందంటే కాదనకుండా లాక్ చేస్తుంది. అది చిన్నదైనా...పెద్దదైనా చేయి దాటిపోకుండా డీల్ కుదుర్చుకుని క్లోజ్ చేస్తుంది. యానిమల్ విజయం దగ్గర నుంచి ఈ రకమైన స్పీడ్ బాగా పెంచింది. ఫాంలో ఉన్నంత కాలమే దున్నుకోవాలి అన్న చందంగా రష్మిక బ్రాండింగ్స్ చేస్తుంది. ఇదంతా కేవలం రష్మిక కష్టార్జితం. నటిగా ప్రయాణం మొదలైన దగ్గర నుంచి తాను సంపాదించిందే ఇదంతా. కన్నడ చిత్రంతో పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే.





# కంగారూ దేశంలో కంగారు పుట్టించిన సమంత



సమంత రూత్ ప్రభు కొద్దిరోజులుగా ప్రకృతి అందాల నడుమ సేద దీరుతోంది. సిటాడెల్ హనీ బన్నీ సిరీస్ తర్వాత కొంత గ్యాప్ తీసుకున్న సమంత రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ పైనా దృష్టి సారించింది. ఇటీవల సొంత బ్యానర్ సినిమా బంగారం షెడ్యూల్ గురించి ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. ఇలాంటి సమయంలో కొంత గ్యాప్ తీసుకుని ఆస్ట్రేలియా టూర్ ని ప్లాన్ చేసింది. ప్రస్తుతం కంగారూ దేశం నుంచి సామ్ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లోకి వచ్చాయి. తాజాగా ఫెదర్‌డేల్ సిడ్నీ వైల్డ్‌లైఫ్ పార్క్‌ను సందర్శించిన సమంత అక్కడ ప్రకృతి - జంతువుల మధ్య వెకేషన్ దేని ఆస్వాధించింది. గురువారం సమంత ఇన్‌స్టాలో చాలా ఫోటోలను పోస్ట్ చేసారు. ప్రకృతి, జంతువులు.. మంచి వైబ్‌లు! కంగారూలకు ఆహారం ఇవ్వడం నుండి నిద్రపోతున్న కోలాలను గుర్తించడం వరకు, ఇది చాలా అందమైన సమయం! వన్యప్రాణుల కోసం ఆస్ట్రేలియన్ లు చేసే అద్భుతమైన పునరావాస పనులన్నింటికీ పార్క్ నిర్వాహకులకు ప్రధాన అభినందనలు అని రాశారు.కటాఫ్, నీలిరంగు డెనిమ్ ప్యాంటు, స్టైలిష్ బూట్లు - హ్యాట్ ధరించి, సమంత అభయారణ్యంలో షికార్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. నెటిజన్లు హార్ట్ ఎమోజీలతో చిలిపిగా మాట్లాడారు. సమంతకు విష్ చేసారు. సమంత చివరిగా ప్రైమ్ వీడియో సిరీస్ %-%సిటాడెల్: హనీ బన్నీ%-%లో వరుణ్ ధావన్‌తో కలిసి కనిపించింది. భారతదేశంలో ఈ సిరీస్ చక్కని ఆదరణ దక్కించుకుంది. ఈ యాక్షన్-ప్యాక్డ్ సిరీస్ 2024 ఫిల్మ్‌ఫేర్ OTT అవార్డ్స్‌లో ఉత్తమ సిరీస్ (విమర్శకులు) , ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డులను గెలుచుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. సిటాడెల్: హనీ బన్నీ .. అమెజాన్ ప్రైమ్ వీడియోలో అమెరికన్ టెలివిజన్ సిరీస్ సిటాడెల్ కి భారతీయ స్పిన్-ఆఫ్.

# మరింత వణుకు పుట్టిస్తున్న ఛోరీ2 టీజర్



హార్రర్ నేపథ్యంలో వచ్చే సినిమాలు ఈ మధ్య ఆడియన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మరీ ముఖ్యంగా చేతబడుల నేపథ్యంలో వచ్చే సినిమాలను చూడ్డానికి ఆడియన్స్ కూడా ఎంతో ఇంట్రెస్టింగ్ గా ఉన్నారు. అందుకే ఓటీటీలు కూడా అలాంటి కంటెంట్ ఉన్న సినిమాలు, సిరీస్‌లను నిర్మించడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అందులో భాగంగానే నుస్రత్ భరూచా ప్రధాన పాత్రలో నటించిన మూవీ ఛోరీ2. బాలీవుడ్ నటి నుష్రత్ భరూచ టాలీవుడ్ ఆడియన్స్ కు పెద్దగా తెలియకపోవచ్చు. కానీ హిందీ ఆడియన్స్ కు మాత్రం నుష్రత్ సుపరిచితురాలే. బాలీవుడ్ లో నుష్రత్ పలు సినిమాలు చేసింది. తెలుగు ఆడియన్స్ కు నుష్రత్ ను పరిచయం చేయాలంటే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ బాలీవుడ్ లో చేసిన ఛత్రపతి సినిమాలో హీరోయిన్ గా నటించిన అమ్మాయని చెప్పాలి. సామాజిక దురాచారాల నుంచి, అతీంద్రియ శక్తుల నుంచి కూతురిని కాపాడుకోవడానికి ఓ తల్లి చేసే పోరాట కథగా రిలీజైన ఛోరీ సినిమాకు ఇది సీక్వెల్ గా తెరకెక్కింది. ఛోరీ మూవీ విమర్శకుల ప్రశంసలు కూడా అందుకోవడంతో దానికి సీక్వెల్ గా వస్తోన్న ఛోరీ2 పై అందరికీ భారీ అంచనాలున్నాయి. విశాల్ ఫ్యూరియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 11 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్టు ఇప్పటికే అనౌన్స్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఛోరీ2పై హైప్ పెంచేందుకు దానికి సంబంధించిన టీజర్ ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. టీజర్ చూస్తుంటే ఫస్ట్ పార్ట్ కంటే మరింత భయంకరంగా ఉంది. మరోసారి అదే స్థలం, అదే ప్రమాదం, అదే భయం అనే మాటలతో మొదలైన టీజర్ నీ కూతురు ఇప్పుడు నాది.. ఎప్పటికీ నాదే అనే డైలాగ్స్ తో కొనసాగుతూ ఆద్యంతం ఆడియన్స్ గుండెల్లో వణుకు పుట్టించింది. టీజరే ఇంత భయంకరంగా ఉంటే మరి సినిమా ఇంకెంత భయంకరంగా ఉంటుందో అని టీజర్ ను చూసి నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# వైట్ సూట్‌లో ఫారియా గ్లామర్ బ్లాస్ట్

'జాతిరత్నాలు' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫారియా అబ్దుల్లా, తన యాక్టింగ్‌తో పాటు యూనిక్ స్టైల్‌కి కూడా మంచి మార్కులు కొట్టేసింది. తన టాలెంట్‌కి తగ్గ అవకాశాల కోసం ఎదురుచూస్తూనే, ఫ్యాషన్ ఫీల్డ్‌లో మాత్రం అడుగడుగునా సత్తా చూపిస్తోంది. సినిమాలు తక్కువైనా, ఫోటోషూట్లతో మాత్రం సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. తాజాగా ఆమె షేర్ చేసిన లేటెస్ట్ లుక్ అందర్నీ మైమరపిస్తోంది. ఈ ఫోటోల్లో ఫారియా తెల్లటి బ్లేజర్ సూట్‌లో స్టన్నింగ్‌గా మెరిసిపోయింది. క్లాసిక్ వైట్ ప్యాంట్ సూట్ కంపోసిషన్‌కు బ్రైటు గోల్డ్ జ్యువెలరీ కాంబినేషన్ ఏ లెవల్లో ఉ



ంటుందో ఈ ఫోటోలు ప్రూవ్ చేశాయి. మెటాలిక్ బ్రేస్‌లెట్స్, లేయర్డ్ నెక్ పీస్, నోస్ రింగ్ వంటి ఆభరణాలు ఆమె లుక్కుని మరింత ప్రీమియంగా మార్చేశాయి. ఆమె మేకప్ కూడా మినిమల్ షైన్‌తో, ఐ షాడో హైలైట్‌గా ఉండటం గమనార్హం. ఈ స్టైల్ మొత్తం ఆమెకు ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లే కనిపిస్తోంది. ఈ కాంప్లిమెంటరీ లుక్‌లో ఫారియా తన గ్లామర్‌తో పాటు తన స్టయిల్ ఓరియెంటేషన్‌ను కూడా చూపించగలిగింది. ఆమె ధరిస్తున్న డ్రెస్, జ్యువెలరీ, స్టైలింగ్ అన్నీ కలిసే ఒక ఆర్ట్ వర్క్‌లా ఫీలయ్యేలా ఉన్నాయి.

ఫారియా ప్రస్తుతం కొన్ని సినిమాలు, వెబ్ ప్రాజెక్ట్స్‌లో భాగంగా బిజీగా ఉంది.అయితే ఆమె కెరీర్ కంటే సోషల్ మీడియాలోని ఈ ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్ ఎక్కువగా వైరల్ అవుతున్నాయి. ప్రతి ఫోటోషూట్‌లోనూ ఆమె తీసుకునే రిస్క్, ఎక్స్‌పెరిమెంట్స్ యువ ప్రేక్షకుల్లో ఆమెకి ప్రత్యేక ఫ్యాన్ బేస్ తీసుకొచ్చాయి. ఫోటోషూట్లలో ఆమె చూపిస్తున్న కాన్ఫిడెన్స్‌కి క్రేజ్ పెరుగుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫారియా పోస్టు చేసిన ఈ పిక్‌లపై ఇప్పటికే హార్డ్‌కోర్ నెటిజన్ల నుండి పాజిటివ్ కామెంట్లు వస్తున్నాయి. మరి అమ్మడికి ఈ గ్లామర్ ద్వారా ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.

## 100కోట్ల డిజాస్టర్ తరువాత మరో లక్కీ ఛాన్స్?

సౌత్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్‌కు బాలీవుడ్ ఎంట్రీ పెద్ద నిరాశను మిగిల్చింది. అట్లీ దర్శకత్వం వహించిన తమిళ బ్లాక్‌బస్టర్ 'తెరి' ఆధారంగా తెరకెక్కించిన హిందీ చిత్రం బేబీ జాన్. అయితే ఈ సినిమా ద్వారా ఆమె హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఇందులో ఆమెకు వన్ ఆఫ్ ది లీడ్ పాత్రే అయినా, సినిమా ఫెయిల్యూర్‌తో పాటు ఆమె నటన కూడా విమర్శలు ఎదుర్కొంది. వరుణ్ ధవన్, జాకీ ష్రాఫ్ లాంటి స్టార్‌లతో కూడిన భారీ బడ్జెట్ మూవీ అయినా, కేవలం రూ.39.28 కోట్లే వసూలు చేయడం అందరికి షాక్ ఇచ్చింది. ఇక దాదాపు రూ.160 కోట్ల బడ్జెట్ ఉన్న ఈ చిత్రానికి భయంకరమైన లాస్ కలిగించింది. ముఖ్యంగా కీర్తి సురేష్ పోషించిన డాక్టర్ మీర వర్మ పాత్ర ప్రేక్షకులలో ఎమోషనల్ కనెక్షన్ రాకపోవడం గమనార్హం. ఆమె నటనపై కూడా విమర్శలు వచ్చాయి. మహానటితో మెప్పించిన ఆమె ఈ సినిమాలో మెరుగ్గా కనిపించలేదన్న అభిప్రాయం స్పష్టంగా వ్యక్తమైంది. ఈ నేపథ్యం చూస్తే, బాలీవుడ్‌లో ఆమె ప్రయాణం ప్రారంభమవకముందే ముగిసినట్టేనా అనే అనుమానాలు కలుగడం సహజం. గతంలో కొంతమంది సౌత్ బ్యూటీలు బాలీవుడ్ లో క్లిక్కయిన కూడా ఎక్కువ



కాలం నిలవలేదు. అలాంటిది ఫస్ట్ సినిమాకే 100 కోట్లు నష్టాలు రావడంతో అమ్మడిపై ఎవరు ఫోకస్ చేయరని కథనాలు వచ్చేశాయి. కానీ తాజాగా వస్తున్న ఓ వార్త మాత్రం ఆమె కెరీర్ పై కొత్త ఆసక్తిని రేకెత్తిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్‌తో కీర్తి కలిసి నటించే అవకాశం ఉందట. ఇది తుది అఫీషియల్ కాకపోయినా, ఇందుకు సంబంధించి బాలీవుడ్ వర్గాల్లో చర్చ సాగుతోందని సమాచారం. రణబీర్ కపూర్ ప్రస్తుతం లవ్ అండ్ వార్, రామాయణం, ధూమ్ 4 వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నా, ఒక కొత్త ఎమోషనల్ లవ్ స్టోరీ కోసం నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారని టాక్. ఆ ప్రాజెక్ట్‌కి కీర్తి ఎంపిక కావడం జరిగితే, ఆమెకు బాలీవుడ్‌లో రెండో అవకాశం లభించనుంది. ఈసారి మాత్రం బలమైన స్క్రిప్ట్, మల్టీ లేయర్డ్ పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశముంది. దక్షిణాదిలో తన ప్రూవన్ స్కిల్స్ ఉన్నప్పటికీ, బాలీవుడ్ ప్రేక్షకులకు కీర్తి సురేష్ నటన సరైన కాన్వాస్‌లో చూపించాల్సిన అవసరం ఉంది. రణబీర్ లాంటి వెర్సటైల్ నటుడితో కలిసి నటించడం ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తే ఆశ్చర్యం లేదు. ఇక బాలీవుడ్‌లో ఆమె మళ్లీ బౌన్స్ బ్యాక్ అవుతుందో లేదో చూడాలి.




హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. స్థల పరిశీలనకు దుబ్బాక వెళ్లాలని సీఎంవోకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు హబ్సీపూర్–లచ్చపేట్ 2 వరుసల రోడ్డుకు రూ.35 కోట్లు మంజూరు చేశారు. హామ్ మోడల్‌లో ఆ రోడ్డును అభివృద్ధి చేస్తామని అధికారులు తెలిపారు.

అడిగిన వెంటనే స్పందించిన రేవంత్‌రెడ్డికి దుబ్బాక నియోజకవర్గ ప్రజల పక్షాన కొత్త ప్రభాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.




హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ కేసులో నటి విష్ణుప్రియ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. మియాపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని నటి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎఫ్ఐఆర్ కొట్టివేయడానికి, దర్యాప్తుపై స్టే విధించేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దర్యాప్తునకు సహకరించాలని విష్ణుప్రియను ఆదేశించిన కోర్టు.. చట్ట ప్రకారం ముందుకెళ్లాలని పోలీసులకు స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్స్‌పై ప్రచారం చేసిన పలువురు నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

## గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా విడుదల




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 66 మంది గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం శుక్రవారం రూ.3 కోట్ల 30 లక్షల ఎక్స్ గ్రేషియాను వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశారని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం సూచన మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఆర్థిక, ప్రణాళిక) కే.రామక్రిష్ణా రావుతో సమన్వయము చేసి నిధులు విడుదల చేయించానని అనిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో 28 మంది, జగిత్యాల 19, కామారెడ్డి 9, నిర్మల్ 7, మెదక్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలలో ఒక్కొక్కరి చొప్పున 66 మంది ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయని వివరించారు. గతంలో 103 మందికి రూ.5 కోట్ల 15 లక్షలు విడుదల చేశారని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 169 మందికి రూ.8 కోట్ల 45 లక్షలు చెల్లింపు జరిగిందని అనిల్ వివరించారు.

## పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా కుదరదు: కేంద్రం

ఢిల్లీ: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు పంపింది. కృష్ణా నదీ జలాల వినియోగంపై రెండు రాష్ట్రాల మధ్య ప్రస్తుత వివాదం సుప్రీంకోర్టులో ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కృష్ణా ట్రిబ్యునల్2 ఇందుకు సంబంధించిన విచారణ చేపడుతోందని కేంద్ర జలశక్తి శాఖ అధికారులు ప్రస్తావించారు. కోర్టు వివాదం నేపథ్యంలో.. ఈ ప్రాజెక్టు టెక్నో ఎకనామిక్ రిపోర్ట్‌ను పరిగణనలోకి తీసుకోవడం సాధ్యం కాదని కేంద్ర జలశక్తి శాఖ తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలు తెలంగాణ రాష్ట్రానికి తిరిగి పంపినట్లు లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ప్రభుత్వం గుర్తుచేసింది. 2024 డిసెంబర్‌లో ఈ ప్రతిపాదనలు తిప్పి పంపామని కేంద్ర ప్రభుత్వం




తెలిపింది. లోక్‌సభలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ ప్రాజెక్టు విషయంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్న అడిగారు. ఈ ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## రేవంత్ రెడ్డి చేతల్లో చూపించారు.. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రశంసలు



నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ శాసనసభలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలిచిపోయే తీర్మానం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటలను చేతల్లో నిరూపించారని తమిళనాడు సీఎం స్టాలిన్ కొనియాడారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ శాసనసభ గురువారం తీర్మానం చేసిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎక్స్?వేదికగా స్పందించారు. న్యాయం, సమానత్వం, సమాఖ్య స్ఫూర్తిని సమర్థిస్తూ సరైన రీతిలో పునర్విభజన కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభలో తీర్మానం చేశారని తమిళనాడు సీఎం పేర్కొన్నారు. చెన్నైలో ప్రతిపాదించిన అంశాలు హైదరాబాద్‌లో నెరవేరాయని, ఇది ఆరంభం మాత్రమేనని.. హైదరాబాద్‌లో ఐక్యకార్యాచరణ సమితి రెండో సమావేశం నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు అదే బాటలో నడుస్తాయని తమిళనాడు సీఎం అభిప్రాయపడ్డారు. పునర్విభజన విషయంలో తమిళనాడును అనుసరిస్తూ, ఈ చర్యను ప్రజాస్వామ్య సమతుల్యతను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నైనా ప్రతిఘటించే సమష్టితత్వాన్ని బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. భారతదేశ భవిష్యత్తును అధర్మ మార్గాన ఒక ప్రాంతానికి అన్యాయం చేసే రీతిన రాసేందుకు ప్రయత్నించే ఎవరినీ అనుమతించబోమని స్టాలిన్ స్పష్టం చేశారు.

## 400 చదరపు అడుగుల్లో ఇల్లు.. ప్రతి దశను ఫొటోలు తీయాలి..

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పాటించాల్సిన పలు గైడ్ లైన్లను ఖరారు చేస్తూ హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వీపీగౌతమ్ సర్క్యులర్ జారీ చేశారు. వీటిని కలెక్టర్లకు పంపారు. ఇంటి నిర్మాణం కోసం.. ముగ్గు పోసిన తర్వాత బేస్ మట్టం పనులు ఆరంభించే ముందు స్థలం ఫొటో తీసి, దాన్ని ఇందిరమ్మ యాప్ లో మొబైల్ ఫోన్ ద్వారా జియో కోఆర్డినేట్స్ నమోదు చేయాలని ఎండీ సూచించారు. ఇంటి నిర్మాణ వైశాల్యం 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఉండాలని.. రెండు గదులు, ఒక వంటగది, బాత్రూంతో సహా ఇంటిని నిర్మించాలని తెలిపారు. ప్రతి దశలోనూ ఫొటోలు తీసి మొబైల్ ద్వారా ఇందిరమ్మ అప్ తో అప్లోడ్ చేయాలని, వీటి ఆధారంగానే లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. పాత ఇంటిని అనుకోనిగాని, ఇప్పటికే ఉన్న ఇంటికి అదనపు గదులుగాని, కొంతవరకు కూల్చి వేసిన వాటికిగాని ఈ స్కీమ్ ద్వారా నిర్మాణం చేయరాదని వివరించారు. ఈ అంశాలను కలెక్టర్లు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. గతంలో నిర్మాణం ప్రారంభించి కొంతవరకు నిర్మించిన ఇండ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇందిరమ్మ స్కీమ్ మంజూరు చేయరాదన్నారు.

ఇండ్లను కలిపి కట్టుకోవడానికి అనుమతించరాదని, ఒకటే ఫ్యామిలీలో ఉన్న కుటుంబ సభ్యులకు ఒక ఇల్లు మాత్రమే ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులందరికీ కలెక్టర్లు సరైన ఆదేశాలు ఇవ్వాలని ..గైడ్ లైన్స్ తప్పనిసరిగా పాటించే లాగా చూడాలన్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లను ఎండీ గౌతమ్ ఆదేశించారు.




జిన్నారం: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద రీతిలో ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. తల్లి తీవ్రమైన కడుపునొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. స్థానిక సీఐ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో చెన్నయ్య, ఆయన భార్య రజిత తమ ముగ్గురు పిల్లలు సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8)తో కలిసి నివాసముంటున్నారు. చెన్నయ్య వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో భార్యాభర్తలతో పాటు ముగ్గురు పిల్లలు ఇంట్లోనే భోజనం చేశారు.

చెన్నయ్య అన్నం, పప్పు తిన్నాడు. భార్య, ముగ్గురు పిల్లలు పెరుగన్నం తిన్నారు. భోజనం తర్వాత చెన్నయ్య ట్యాంకర్ నడిపేందుకు చందానగర్ వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి వచ్చాడు. రాజిత తలుపులు తెరవగా.. పిల్లలు నిద్రపోతున్నారు.

శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజితకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో స్థానికుల సహాయంతో చెన్నయ్య ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆ తర్వాత పిల్లలను పరిశీలించగా.. అప్పటికే ముగ్గురూ మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



చెన్నయ్యది రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండ లం మెడకపల్లి. ఉపాధి కోసం గత కొంతకాలంగా ఆయన అమీన్‌పూర్‌లో ఉంటున్నాడు. చిన్నారుల మృతిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి..!: దివ్యాంగ దంపతుల విజ్ఞప్తి

**హనుమకొండ: వారు పుట్టుకతోనే దివ్యాంగులు.. అయినా వైకల్యం శాపమని ఏనాడు అనుకోలేదు . అందరిలా నడవలేకపోతున్నామని బాధపడలేదు. ఆత్మవిశ్వాసంతో జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమించారు. రెండేళ్ల క్రితం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఒకరికొకరు తోడుగా కాలం వెళ్లదీస్తున్నారు. సాఫీగా సాగుతున్న వీరి జీవితంలో అనుకోని సంఘటన ఎదురైంది. భార్యకు ప్రమాదవశాత్తు కాలు విరగడంతో పూర్తిగా మంచానికే పరిమితమైంది. ఎవరిపై ఆధారపడకుండా జీవనం సాగించిన వీరు.. ఇప్పుడు దాతల సాయం కోరుతున్నారు.**




తాజా భూకంపం తీవ్రతకు మయన్మార్ రాజధాని నేపిడాలోని 1,000 పడకల ఆసుపత్రి కుప్పకూలింది. దీంతో అత్యధికంగా క్షతగాత్రులు ఇక్కడే ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ ఆసుపత్రికి ఇంకా పేరు పెట్టలేదు. ఈ ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఇక్కడ అత్యధిక మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఓ ఆంగ్లవార్తా సంస్థ కూడా పేర్కొంది. చాలా మంది తమ ఆత్మీయుల కోసం శిథిలాల్లో గాలింపు కొనసాగిస్తున్నారు. మయన్మార్ దేశవ్యాప్తంగా చాలా చోట్ల భవనాలు, పాత వంతెనలు కుప్పకూలినట్లు వార్తలొస్తున్నాయి. ఇవాళ ఉదయం మయన్మార్, థాయ్‌ల్యాండ్ సహా చైనా, భారత్, వియత్నాం తూర్పు ఆసియా దేశాల్లో 7.7, 6.4 తీవ్రతతో రెండు భూకంపాలొచ్చాయి. ఫలితంగా థాయ్‌ల్యాండ్, మయన్మార్‌లో భారీగా ఆస్తినష్టం చోటు చేసుకొంది. మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మాండలే అనే ప్రదేశంలో మసీదు కూలి దాదాపు 20 మంది చనిపోగా.. టవుంగూలో పునరావాస కేంద్రం ధ్వంసమై మరో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మయన్మార్‌లోని సైనిక పాలకులు అంతర్జాతీయ సమాజం సాయం చేయాలని కోరారు. ఈ మేరకు మిలటరీ జుంటా ఓ ప్రకటన విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా అత్యవసర పరిస్థితి ప్రకటించింది. నేపిడాలో క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న ఆసుపత్రిని మిలటరీ చీఫ్ మిన్ ఆంగ్ లయాంగ్ సందర్శించారు.

**బ్యాంకాక్‌లో ఇద్దరి మృతి..** భూకంపం కారణంగా బ్యాంకాక్‌లో ఇద్దరు చనిపోయారు. నగరంలో కుప్పకూలిన 30 అంతస్తుల భారీ భవనం కింద 43 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల కోసం దీనిని నిర్మిస్తున్నారు. మరోవైపు ఆ దేశ స్టాక్ ఎక్స్ఛేంజి కార్యకలాపాలను సస్పెండ్ చేశారు. దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. ఇక తొలిసారి ప్రకంపనలు రాగానే బ్యాంకాక్‌లో మెట్రో సేవలను నిలిపివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పినట్లైంది. రెండో సారి ప్రకంపనలకు ఏకాంగా మెట్రో రైళ్లు కూడా ఊగిపోయాయి. చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో కూడా తీవ్ర స్థాయిలోనే భూకంపం వచ్చింది. మేఘాలయ ఈస్ట్‌గారో హిల్స్‌లో 4 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగ్లాదేశ్‌లోనూ 7.3 తీవ్రతతో భూమి కంపించినట్లు తెలుస్తోంది.

## అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ..!

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. కథనాల ప్రకారం.. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com